

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :13 సంచిక: 11 హైదరాబాద్ 2014 మార్చి పేజీలు 40

Please visit : www.srimeherbaba.com వార్షిక సభ్యత్వం : రూ.100/-

### జూబ్లి బాబా సెంటర్‌లో రెండ్రోజుల

# యువ సమ్మేళనం

2014 మే 17,18 తేదీలలో హైదరాబాద్‌లోని జూబ్లి బాబా సెంటర్‌లో 18 – 35 సంవత్సరాల వయస్సు గల యువ బాబా ప్రేమికులకు ప్రత్యేక బాబా సహవాస్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు శ్రీ పి. రాజేంద్ర మెహెర్ (98490 46848) ఒక ప్రకటనలో తెలిపారు. మే 17 ఉదయం 7 నుండి మే 18 సాయంత్రం 6 దాకా పలు కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. అనేక ఆసక్తికర అంశాలతో కూడిన ఈ సహవాస్‌కు విచ్చేసే యువతకు స్థానిక బాబా సెంటర్‌లోనే భోజన, బస ఏర్పాట్లు చేశారు. ఆ రెండ్రోజులూ తప్పనిసరిగా బాబా సెంటర్‌లోనే ఉండాలి. మరొక ముఖ్యమైన విషయం ఏమంటే కార్యక్రమం ఆద్యంతం ఇంగ్లీషులో కొనసాగుతుంది. ఇంగ్లీషు బాగా వచ్చిన వారికి మాత్రమే ఈ సహవాస్ అనువుగా వుంటుందని గుర్తించాలి. ఈ సహవాస్ కేవలం 75 మందికి మాత్రమే పరిమితం. కాబట్టి, ఆసక్తిగలవారు త్వరలో తమ వివరాలు నమోదుచేయించుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు. ఆసక్తి గల యువత ఏప్రిల్ 25, 2014 లోగా నిర్ణీత ధరఖాస్తును పూరించి అందజేయాలని, మరిన్ని వివరాలకు శ్రీ రాజేంద్రమెహెర్‌ను సంప్రదించగలరు.

*

# మెహెరాబాద్ దాకా మోటార్ సైకిల్ యాత్ర

2014 మే 6 – 12 తేదీలలో శ్రీకాకుళం జిల్లా రాజాం నుండి మెహెరాబాద్ దాకా మోటారు సైకిళ్ళపై యువజన యాత్ర నిర్వహించాలని నిర్ణయించినట్లు శ్రీ శ్రీనివాస్ (96666 35443) ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల బాబా ప్రేమికులు శ్రీ పి. శ్రీనివాస్‌ను సంప్రదించగలరు.

*

# పావగడ సెంటర్ రజతోత్సవం

అవతార్ మెహెర్‌బాబా పావగడ సెంటర్, తుంకూర్ జిల్లా, కర్ణాటక, రజతోత్సవ వేడుకలు 2014 జూన్ 3,4,5 తేదీలలో పెద్ద ఎత్తున ఏర్పాటు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల బాబా ప్రేమికులు 1) రఘుపతి – మెహెర్‌గడ (పావగడ) – 098804 62970, 2) ఏ.వి.జి. హరిప్రసాద్ – బెంగుళూరు – 099862 76741, email: meherd.meher77@gmail.com సంప్రదించవల్సిందిగా కోరుతున్నారు.

# బాబా సందేశం

నీ కోరికల చిట్టాతో భగవంతుడిని విసిగించకపోతే,
నీకు అన్నీ ఆయనే సమకూరుస్తాడు.

**One who asks for nothing, gets everything .**

**- MEHER BABA**

## లోపలి పేజీలలో...



| | | |
|---|---|---|
| 1. | సంపాదకీయం | 5 |
| 2. | గుజరాతీ సహవాస్ | 6-11 |
| 3. | ప్రిన్సెస్ నోరినా మాచబెల్లీ | 12-19 |
| 4. | లార్డ్ మెహెర్ | 20-28 |
| 5. | అవతారుని ద్వితీయ షష్ఠిపూర్తి మహోత్సవాలు | 29 |
| 6. | మా మాటలు | 30-37 |
| 7. | ప్రార్ధనలు | 38 |



**ముఖ చిత్రం**

**పాశ్చాత్య బాబా ప్రేమికురాలు రానో గెల్లీ**
**1930వ దశకంలో గీసిన అవతారుని చిత్రం.**

**మనవి**

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**


*వ్యవస్థాపకులు:*
**దశిక ప్రసాదరావు**
**040-65699611**


Please visit : www.srimeherbaba.com

# బెంగళూరులో సహవాస్



బెంగళూరులోని జయానగర్‌లో అవతార్ మెహెర్‌బాబా సెంటర్‌లో ప్రత్యేక సహవాస్ కార్యక్రమం 2014 జూన్ 14,15 తేదీలలో ఏర్పాటు చేసినట్లు శ్రీ ఎ. రాజగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. **ఈ** సందర్భంగా స్థానిక సెంటర్ ప్రాంగణంలో మెహెర్‌బాబా వారి పాలరాతి విగ్రహ ప్రతిష్ఠ ప్రారంభోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ పాలరాతి విగ్రహాన్ని రాజస్థాన్‌లోని జైపూర్‌లో రూపొందించినట్లు ఆయన తెలిపారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొనవల్సిందిగా శ్రీ రాజగోపాల్ కోరుతూ, తగిన ఏర్పాట్లు చేసుకునేందుకు వీలుగా హాజరుకాగోరు బాబా ప్రేమికులు తమ వివరాలు **ఏప్రిల్ 15లోగా**avatarmeherbababangalore@gmail.com, లేదా C/o 1186/14, 35th C-Cross, 26th Main, 4th Block, Jaya Nagar, Bangalore - 41, Smt. Narmada (09980522414), Sri Rajagopal (09845697738) తెలియజేయవల్సిందిగా కోరుతున్నారు.

## జలనిధి



గత కొంత కాలంగా, అంటే 2013 అక్టోబరు మాసంలో శ్రీ వై.యస్. రావు బాబాలో ఐక్యమయినప్పటి నుండీ రెస్టు హౌస్‌కు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతిరోజు స్థానికంగా ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి సరఫరా చేస్తునట్లు, తద్వారా అధిక ఆర్థిక భారాన్ని భరించవల్సివచ్చిందని అన్నారు. ఈ ఆర్థిక లోటును పూరించవల్సిన ఆవశ్యకత ఎంతో వుందని చెబుతూ శ్రీ వై.యస్. రావు గారు ఏర్పాటు చేసిన **'జలనిధి'కి** తగిన విరాళాలు అందజేసి సహకరించవల్సిందిగా యాజమాన్యం కోరుతున్నారు. రెస్టు హౌసులో మీరు చెల్లించే లేదా అందజేసే విరాళాలకు స్థానిక మేనేజర్, ఆంధ్రా రెస్టు హౌస్ నుండి 'రశీదు' తప్పక పొందవల్సిందని అన్నారు.

## సంపాదకీయం

# కనువిప్పు

అవతారుని అమరతిథి వేడుకలు జనవరి 31న ముగిసాయి.
అవతారుని జన్మదిన వేడుకలు,
ద్వితీయ షష్ఠిపూర్తి మహోత్సవాలు ఘనంగా జరుపుకున్నాం.
ఐతే, ఎవరి అనుభవాలు వారివి.
ఒక సందర్భంలో బాబా తన మండలివారితో మాట్లాడుతూ,
నన్ను అవతారునిగా నమ్మే వారందరికీ,
నేను ఒకే ఒక మాట చెప్పదల్చానన్నారు.
అదేమంటే, మీకు ఇష్టమైనవాటి గురించి నన్ను ప్రత్యేకంగా అడగవలిసిన పనిలేదన్నారు.
మీకెప్పుడు ఏది ఇవ్వాలో, ఎప్పుడు ఏమి తీసేసుకోవాలో
నాకు బాగా తెలుసని గుర్తుచేశారు.
కాబట్టి, మీరు దేని గురించి ఆలోచించ వద్దు.
హాయిగా, ప్రశాంతంగా ఉండమన్నారు.
కీర్తి ప్రతిష్ఠలు, ధనం, సంతానం, ఇతరత్రా అన్నీ అప్రధానం.
భగవసాన్నిధ్యం చేరడం మానవ జీవిత లక్ష్యం కావాలి.
భగవంతుడు మినహా మిగిలినదంతా మిధ్య. భగవంతుడిని ప్రేమించండి.
ఇది తెలియజేయడానికే నేను మీ మధ్యకు వచ్చానన్నారు.
భగవంతుని ప్రేమ అందించడానికే నేను అవతారునిగా వచ్చాను.
ఐతే, మీకు నేను భగవంతుడిని అనే అనుభవం లేదు. ఆ అనుభవం పొందాక,
మీరు నాకు విధేయులుగా ఉండటంలో ప్రాధాన్యత ఏమీ లేదు.
నా దివ్యత్వం గురించి మీకే మాత్రం తెలియనప్పుడే,
నాపట్ల విధేయులుగా ఉండటంలో ఎంతో గొప్పదనం వుందన్నారు బాబా.
నేనెవరో తెలియకుండా నాపట్ల విధేయులుగా వుండటం చాలా గొప్ప విషయం.
పాశ్చాత్య వనిత మహారాణి నోరినా మచ్‌బెల్లీ విషయంలో ఇది నిజం.
ఆమె గురించి ఈ సంచికలో సంక్షిప్తంగా, సవివరంగా ప్రచురించాం.
ఈ కోవకు చెందిన సార్థకజన్ములు ఎందరో ఉన్నారు.
నేటికీ మెహెర్‌బాబా భగవంతుడేనా? సత్పురుషుడా? అని
డోలాయమానంలో వున్నవారికి వీరి అనుభవాలు
కనువిప్పు కలిగిస్తాయి.

*

# గుజరాతీ సహవాస్

## 1955 నవంబర్ 3

గుజరాతీ బాబా ప్రేమిక సహవాస్‌లో పాల్గొనేందుకై ముంబాయి, పూణే, సూరత్, నవసారి, బాజ్వా ప్రాంతాల నుండి, అలాగే ఢిల్లీ, డెహ్రాడూన్, కరాచీల నుండి మొత్తం 97 మంది బాబా ప్రేమికులు నవంబరు 3 కల్లా మెహెరాబాద్‌కు చేరుకున్నారు. ఆ మర్నాడు సహవాస్ ప్రారంభమయ్యింది.

సహవాస్ తొలిరోజున అంటే నవంబరు 4న బాబా మెహెరాజాద్ నుండి మెహెరాబాద్‌కు వస్తూ, అహ్మద్‌నగర్‌లో అక్బర్ ప్రెస్ దగ్గర మెహెర్‌జీ సాతాను తన కార్లో ఎక్కించుకున్నారు.

అలా అహ్మద్‌నగర్ నుండి బయల్దేరాక దార్లో ఒక గేదె అనుకోకుండా బాబా ప్రయాణిస్తున్న కారుకి అడ్డొచ్చింది. కారు నడుపుతున్న ఏరుచ్ ఎలాంటి ప్రమాదం జరగకుండా చాకచక్యంగా పెద్ద ప్రమాదం నుండి తప్పించాడు.

"ఈ సమయంలో తన నామం ఎవరు తలుచుకున్నారని"

బాబా కార్లోవున్నవాళ్ళని ప్రశ్నించారు.

బాబా నేను మీతో మాట్లాడుతున్నాను,

కాబట్టి నేను మీ నామం తలుచుకునే అవకాశంలేదన్నాడు ఏరుచ్.

నేను నీ వ్యక్తిగత విషయాలు చూస్తున్నాను గనుక,

నాకూ నీ నామం తలచుకునే అవకాశం రాలేదన్నాడు కాకాబారియా.

ఇకపోతే, నేను నీతో ప్రయాణిస్తున్నాను కనుక,

నీ నామం వల్లె వేయాల్సిన అవసరం నాకు రాలేదు అన్నాడు మెహెర్‌జీ సాథా.

ఐతే, ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు ఏమైనా జరుగబోయే సమయంలో, ముందుగా నా నామం తలుచుకోండి, అని బాబా హెచ్చరించారు.

మీకంతా మంచి జరుగుతుందన్నారు.

ఆ రోజు బాబా తన మండలివారితో కలిసి ఉదయం 8.20కి మెహెరాబాద్‌కు వచ్చారు. బాబా ప్రేమికులు అవతార్ మెహెర్‌బాబాకి జై అని జయజయనాదాలతో స్వాగతం పలికారు. బాబా తన కుర్చీలో కూర్చుని విచ్చేసిన ప్రేమికులను కుశల ప్రశ్నలు అడిగారు. ఆరోగ్యం ఎలా వుందన్నారు.

రాత్రి భోజనం బాగుందా? బాగా నిద్రపోయారా? అని అడిగారు.

నేనయితే నిన్నటి రోజున నిద్రపోలేదన్నారు బాబా.

అలాగే సహవాస్ నియమావళిని అందరూ నోటీసుబోర్డులో చదివారా? అని అడిగారు.

రానోగెల్లి గీచిన భగవంతుడు మినహా మిగిలినదంతా మిధ్య అని సూచించే
చిత్రపటాన్ని చూశారా అని అడిగారు.
ఆ తర్వాత విచ్చేసిన ప్రేమికులందరూ బాబాను పూలమాలలతో ముంచెత్తారు.
వారందరికీ బాబా ఆలింగనం ఇచ్చి,
సహవాస్ అంటే ఏమిటో సవివరంగా చెప్పారు.
ఒక కుటుంబంలోని సభ్యులుగా ఒకరితో మరొకరు భౌతికంగా కలిసిమెలసి
దగ్గరగా ఉండటమే సహవాస్ అని బాబా అన్నారు.
నేను మీతో కలిసి వుండటం, మీరు నాతో కలిసి ఉండటం
ఈ రెండూ ఒకటి కాదన్నారు.
అనాదిగా బాబా మీ అందరితో వున్నాడు.
ఐతే మీరిక్కడ బాబాతో ఉన్నారు.
అన్నీ మరచిపోయి హాయిగా, ప్రశాంతంగా నా సహవాసంలో వుండండి.
ఆలోచనలు అనేకం వస్తుంటాయి, పోతుంటాయి.
వాటిని అదుపులో వుంచలేం!
వాటిని ఆపడం సాధ్యమా? అని ప్రశ్నించారు.
నిన్ను నీవు మరచిపోయి, బాబా సహవాస్‌లో సంపూర్ణంగా లీనమయితే,
ఆ ఆలోచనలు నిన్నేమీ చేయలేవన్నారు.
ఈ ఆరు రోజులూ నా సహవాసంలో అన్నింటినీ మరచిపోయి హాయిగా వుండండి!!
మీ పేరు ప్రఖ్యాతులు, మీ తెలివితేటలు ఆధ్యాత్మిక అనుభవాలు
అన్నింటినీ మరచిపోండన్నారు!!
ఇక్కడ ఏం జరుగుతోందో, నేనేం చెబుతున్నానో జాగ్రత్తగా ఆలకించండి.
నేను మీ హృదయాల్లోకి ప్రవేశించేలా పరిశుభ్రంగా, ప్రశాంతంగా ఉండండి.
అన్నింటికంటే ముఖ్యమైంది ఏమంటే,
మీ కష్టాలు, మీ కుటుంబం, ఆరోగ్యం, ఆర్థిక బాధలు
ఇతరత్రా అన్నీ మరచిపోయి, కేవలం బాబా ప్రేమపై దృష్టి సారించండన్నారు!!
నేనేదో మహిమలు చేస్తానని ఆశించ వద్దండి!!
మీరేదో ఈ సహవాస్‌కు ఎంతో దూరం నుండి,
ఎన్నో కష్టానష్టాలు భరించి, ఇక్కడ కార్యక్రమాలకు హాజరవుతున్నారు గాన
ఇక మీ కష్టాలు గట్టెక్కుతాయని ఆశపడొద్దని బాబా హెచ్చరించారు.
ఇకపై ఎలాంటి కష్టాలు ఉండవనుకోవద్దు అని గుర్తుచేశారు.
అలాంటి మహిమలు, మహత్యాలు నేనేమీ చేయనన్నారు బాబా.
అలాంటి మహత్యాలు చేయడానికి తన దగ్గర ఏమీ లేదన్నారు.

అలాగే నా ఆశీస్సులు మీకు ఎల్లవేళలా ఉంటాయని
దాంతో మీ ఆరోగ్యం, ఆదాయం రెట్టింపవుతుందని భావించవద్దన్నారు బాబా.
నా దగ్గరకు రావడం వల్ల మీ ఆరోగ్యం బాగుపడుతుందనుకుంటే
తప్పులో కాలేసినట్లేనన్నారు. ఆరోగ్యం మరింత క్షీణించినా ఆశ్చర్యపడొద్దన్నారు.
మీ అందరికీ **'నా ప్రేమను'** పంచడానికే భువి నుండి దిగివచ్చానన్నారు.
తన నుండి ప్రేమను తప్పించి మరేమీ ఆశించవద్దని బాబా గట్టిగానే హెచ్చరించారు.
ప్రేమ గురించి కొన్ని వందలు, వేల పుటలలో సాహిత్యం లభిస్తుంది.
కానీ చాలా కొద్దిమంది మాత్రమే ప్రేమను పొందుతారు.
చాలా కొద్దిమందికే ప్రేమ లభిస్తుంది.
నీవు నన్ను నిజంగా ప్రేమిస్తుంటే, నీవు ఇక్కడ వుండేవాడివే కాదు.
నా నిజదర్శనం నీకు లభించి వుండేది.
నేను చెబుతున్నది శ్రద్ధగా ఆలకించండి.
ఓ మేధావిలాగా ఆలోచించాల్సిన పని లేదు.
మన ఇద్దరి మధ్య ఎలాంటి అడ్డు గోడ లేదు.
నేను-నాదీ అన్నదే భగవంతునికి - భక్తునికీ మధ్యన వున్న అడ్డు తెర.
ఆ తెర తొలగిపోతే దేవుని నిజదర్శనం లభిస్తుందన్నారు బాబా.
నేను - నాది అనేదానిపై మరింత వివరణ ఇస్తూ,
నీకు బాగా ఆకలివేస్తే - నాకు ఆకలిగా వుందంటావ్.
ఒంట్లో నలతగా వుంటే - నాకెందుకో బాగాలేదు,
ఇలా నా - నేనులను విరివిగా నిత్యజీవనంలో వాడుతుంటాం.
ఆ 'నేను' - నేనన్నదే భగవంతునికి - భక్తునికీ మధ్యన గొప్ప అడ్డు తెర
అని బాబా అన్నారు.
ఆ తెర తొలగిపోయిన రోజున భగవదైక్యం సాధ్యమౌతుంది.
ఈ నేనూ - నాది అనే భావన వల్ల మానవులు అనేక ఇబ్బందులు
ఎదుర్కొంటున్నారు. ఈ 'నేను' అనే అడ్డుతెర ఎలా తొలగించాలి?
కొన్ని వేల జన్మలు ఎత్తినా ఈ తెర తొలగించడం సాధ్యం కాదు.
ఆ అడ్డుతెర వలననే నన్ను ప్రేమించవల్సిన రీతిలో
నన్ను ప్రేమించడంలో మీరు విఫలమౌతున్నారని బాబా అన్నారు.
ఈ ఆరు రోజులూ నా మండలివారి మాదిరిగా నాతోపాటు సన్నిహితంగా వుండండి!
నన్ను ప్రేమించాల్సిన రీతిలో ప్రేమించటం మీకే కాదు,
ఎన్నో సంవత్సరాలుగా నాతో వుంటున్న మండలివారికి కూడా చేతకాలేదు.
నేను కనుసైగ చేసినంతనే నా మండలి సభ్యులు వారి జీవితాలను

నా పాదాల చెంత పణంగా పెట్టడానికి సిద్ధంగా వున్నారు.
ఐనప్పటికీ నేను కోరుకునే 'ప్రేమ' వారి దగ్గర లేదు.
ప్రేమ లేకపోయినా వారు నాతో ఉంటున్నారు.
నేను ఆశించే ప్రేమ వారి వద్ద ఉండి వుంటే –
నాకు విధేయులుగా వుండాల్సిన పనేముందన్నారు.
వారు నాలో ఐక్యమయి వుండేవారు.
ప్రేమ కన్నా విధేయత మిన్న అన్నారు.
ఆ విధేయత నూరు శాతం వుండాలి సుమీ! అన్నారు బాబా.
హాఫీజ్ సూక్తి నొకదాన్ని ఉటంకిస్తూ –
విధేయత – అంటే విధేయతనే!
ఎందుకు? ఏమిటని ప్రశ్నించ రాదు.
విధేయత గురించి మరింతగా వివరిస్తూ,
గురువు దగ్గర ఎలాంటి ఆలోచనలు లేకుండా
సేవకునిగా విధేయతగా వుండాలన్నారు.
నేనెవరినైనా, వాని కొడుకుని చంపమని ఆదేశిస్తే,
క్షణకాలమైనా ఆలోచించకుండా,
నా ఆదేశాలు అమలు చేసేలా వుండాలన్నారు.
ఇదంతా విన్నాక కూడా మీరు నాకు విధేయులుగా వుండగలరా?
అని బాబా ప్రశ్నించారు.
మీ హృదయాలు అందుకు అంగీకరిస్తాయా? అని అన్నారు.
సాధారణంగా అనేకమంది నా దగ్గరకు వస్తారు.
నా మెడలో పూలదండలు వేస్తారు.
నా ప్రార్ధనలు చేస్తారు.
ఆ తర్వాత నా ఆశీర్వచనం కోరతారు.
నా పాదాలకు నమస్కరించడం,
నా ఆరతి ఆలాపించడం,
వీటికోసం కాదు నేను వచ్చింది.
ఇది సంత్, సత్పురుషులకు సరిపడుతుందేమోకానీ,
నా విషయంలో ఇవి ఏమాత్రం సరిపోదు.
మిమ్మలందర్నీ ఇక్కడకు ఎందుకు పిలిచాననుకున్నారు.
మీ ప్రేమను పొందడానికి,
నాకు విధేయులుగా మీరు ఉండాలని,

తద్వారా మీకు భగవసాన్నిధ్యంలో ఉంటున్నామన్న అనుభూతి లభిస్తుందని
మిమ్మలందర్నీ ఇక్కడకు పిలిపించాను.
మీ ఉద్దేశ్యం అది కాకుంటే ఏదో వాహ్యాళికి ఇక్కడకి వచ్చిన దాంతో సమానమౌతుంది.
మీ అందరికీ ఒకటి స్పష్టం చేయదల్చాను.
భగవంతుడు ఒక్కడే సత్యం! మిగిలినదంతా మిధ్య!!
ఇది నా అనుభవం లోని మాట.
మనం చూస్తున్నది, అనుభవిస్తున్నదంతా ఏమిటి?
మనం జీవిస్తున్న ఈ జీవితం,
మీరిక్కడ ఈ సహవాస్‌లో పాల్గొంటున్నది,
నా మాటలు, మెహెర్‌బాబాగా నేనిక్కడ మీముందున్నది,
**అంతా ఒక పెద్ద కల.**
ప్రతిరోజూ మీరు కలలుగంటున్నారు.
తెల్లవారగానే నిద్ర నుండి లేస్తున్నారు.
తిరిగి రాత్రి నిద్రలో కలలుగంటున్నారు.
ఇదొక చక్రభ్రమణం.
ప్రస్తుతం మీరందరూ నిద్రపోతున్నారు.
ఆ నిద్రలో నన్ను కలగంటున్నారనుకోండి.
బాబా మిమ్మల్ని నేరుగా చూస్తుంటే కలగనడం ఎలా అవుతుందని మీరు అడగవచ్చు.
కానీ మీరిక్కడ చూస్తున్నది, అనుభవిస్తున్నదంతా పెద్ద కల.
మీరు ఈ నిజాన్ని తెలుసుకుని,
భగవదర్శన అనుభవం మీరు పొందినప్పుడు,
ఆ అనుభూతి పొందినప్పుడు,
మీరు చూస్తున్నదంతా పెద్ద కల అని మీకు తెలుస్తుంది.
తల్లి కడుపున పిల్లవాడు పుట్టాక, అతడు పెరిగి పెద్దవాడవుతాడు.
బుడి బుడి నడకల స్థాయి నుండి వేగంగా పరుగెత్తే యువకునిగా,
ఆ తర్వాత మధ్యవయస్సు,
ఆ పిదప ముసలివానిగా చేతకర్ర బడతాడు.
ఈ క్రమంలో అతను ఎప్పుడైనా తానెందుకు జన్మ ఎత్తాడని వెనక్కి తిరిగి
ఒక్క క్షణమైనా ఆలోచిస్తాడా?
పునరపి మరణం, పునరపి జననం,
కాలగమనంలో ఇలా ఎన్నో జన్మలు,
మరెన్నోమార్లు మరణం సంభవిస్తున్నా,

మానవుడు ప్రాపంచిక విషయాలపట్లనే తన దృష్టినంతా కేంద్రీకరిస్తాడు కానీ,
ఎన్నడూ మానవ జీవిత లక్ష్యం దిశగా కానీ...
అజరామరమైన భగవత్ సత్యం వైపు ఏమాత్రం దృష్టి సారించదు.
ఈ మాయా జగత్తులోనే, కలలలో ఓలలాడుతుంటారు.
ఏ కొందరో కానీ జీవిత సత్యాన్ని తెలుసుకునేందుకు మేల్కొనరని బాబా అన్నారు.
కొన్ని వేల మంది భగవత్ప్రేమ పొందడానికి అనుక్షణం పరితపిస్తుంటారు.
ఏ ఒక్కరో ఆ ప్రేమకు పాత్రులవుతారని హాఫీజ్ చెప్పిన మాటలు బాబా ఊటంకించారు.
ఈ చైతన్యం కావాలంటే ఎన్నో వేల జన్మలు ఎత్తవల్సివుంటుంది.
మానవ జీవిత లక్ష్యమైన బ్రహ్మైక్య సాధన కోసం మానవుడు కొన్ని యుగాలు
పరితపించాలని మన పురాణ గ్రంధాలు చెబుతున్నాయి.
కానీ, ఈ అవతార కాలంలో, ఎవరైతే తనకు విధేయులుగా వుంటారో
వారికి భగవత్ దర్శనం తప్పక లభిస్తుందని బాబా భరోసా ఇచ్చారు.
విధేయత సంతోషంతో కూడినదై, మనస్ఫూర్తిగా వుండాలి.
అదే ప్రధానం అన్నారు.
సంతోషంగా, మనస్ఫూర్తిగా కాకపోయినా
కనీసం విధేయులుగానైనా వుండాలి!!
ఉదాహరణగా చెబుతూ
నేను రావ్‌సాహెబ్‌ని తన కొడుకుని చంపివేయమని ఆదేశిస్తే,
రావ్‌సాహెబ్ అయిష్టంగానైనా నా ఆదేశాలు పాటిస్తే,
అతను నా కృప పొందగల్గుతాడు.
మీరూ ఆలోచించండి!
మీ హృదయాలను అడగండి.
మీరూ ఆ మాదిరిగా నా ఆదేశాలు విధేయతతో అమలు చేయడానికి సిద్దంగా
వున్నారా? అని ప్రశ్నించారు.
ఒకవేళ మీ మనస్సు అంగీకరించకపోతే ఏం చేయాలి?
ఇదంతా మనస్సు ఆడిస్తున్న ఆట.
నేను కోరుకుంటే, హార్మోనియం తనంటతానుగా ఎవరి సహాయం లేకుండానే
సంగీతాన్ని అందిస్తుంది.
దాంతో ప్రజలు నన్ను దేవుడిగా ఆరాధిస్తారు.
నేను ఏం చేయమంటే అది చేయడానికి సిద్దమవుతారు కూడా.
ఐతే, వారి విధేయత – హార్మోనియంపై కానీ,
నా పట్ల కానేకాదని బాబా అన్నారు. **(సశేషం)**

# ప్రిన్సెస్ నోరినా మాచబెల్లీ



మెహెర్‌బాబా తన ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు పాశ్చాత్య దేశాలలో స్త్రీలను

భారత దేశంలో పురుషులను ఎంపిక చేసుకున్నారు.

బాబా పాశ్చాత్య దేశాలలో స్త్రీలను ఎందుకు ఎంచుకున్నారు ?

ఇందొక మంచి ప్రశ్న.

ఇందుకు జవాబుగా ఒక సందర్భంలో బాబా ఏమని చెప్పారంటే –

తూర్పు దేశాలలో పురుషులు ఆధ్యాత్మికంగా ముందంజలో వున్నారన్నారు.

అలాగే, పాశ్చాత్య దేశాలలో అత్యధిక శాతం స్త్రీలు ఆధ్యాత్మిక మార్గంలో వున్నారన్నారు. అంతేకాదు, ఈ దిశలో భారతీయ ఆత్మలు అమెరికా, ఇంగ్లాండు

వంటి దేశాలలో జన్మ తీసుకుంటున్నారన్నారు.

అలాగే, అక్కడివారు మన దేశంలో జన్మిస్తున్నారని బాబా స్పష్టం చేశారు.

అమెరికా, ఇంగ్లాండు దేశాలలో ఎందరో పాశ్చాత్య వనితలు

బాబా ప్రేమికులుగా బాబా నామవ్యాప్తికి ఎంతగానో కృషి చేశారు.

ఆ కోవలో చెప్పుకోవల్సివస్తే ప్రధానంగా

ముగ్గురు అతివలు గురించి తప్పక తెలుసుకోవాలి.

1. **ఎలిజెబెత్ పాటర్‌సన్.**
2. **ప్రిన్సెస్ నోరినా మాచబెల్లీ**
3. **కౌంటెస్ నాడినా టాల్‌స్టాయ్**

ఈ ముగ్గురూ మూడు దేశాలకు చెందినవారు.
నోరినా – ఇటలీ దేశానికి చెందినది.
నాడినా – రష్యన్, ఎలిజెబెత్ – అమెరికా దేశీయురాలు.
గత సంచికలో 1930వ దశకంలోనే ఎలిజెబెత్ పాటర్‌సన్
మెహెర్‌బాబాలో తన ఇష్టదైవాన్ని దర్శించుకుని అవతారునికి ఎలా విధేయతగా
అంకితమయ్యిందో తెలుసుకున్నాం.
ఆ త్రయంలో ఒకరైన ప్రిన్సెస్ నోరినా మాచబెల్లీ గురించి ఈ సంచికలో
క్లుప్తంగా తెలుసుకుందాం.
ఈ ముగ్గురూ న్యూయార్క్ సిటీలో ఒక అపార్ట్‌మెంటులో ఉండి బాబా కార్యక్రమాలు
నిర్వహించారు. నోరినా బాబా సందేశాలపై అనర్గళంగా ప్రసంగించేది.
అలా ఆమె ప్రసంగాలు విని బాబా పరిధిలోకి వచ్చింది అమెరికన్ వనిత
శ్రీమతి ఫిలిస్ ఫ్రెడ్రిక్. ఆమె గొప్ప రచయితగా, జర్నలిస్టుగా,
పత్రికా సంపాదకురాలిగా ప్రఖ్యాతి.
ఎలిజెబెత్ పాటర్‌సన్ ఆహ్వానం మేరకు ఫిలిస్ కూడా న్యూయార్క్‌లో వారుంటున్న
అపార్టుమెంటులో అవతారుని సేవలో భాగంగా చేరింది.
ఇదంతా **1944–46** నాటి మాట.
ఫిలిస్ పత్రికా రచయిత కదా..,
ఆమె బాబాను దర్శించుకున్న మరుసటి సంవత్సరంలో బాబావారి అనుమతితో
**అవేకనర్** పేరిట ఇంగ్లీషు పత్రికను ప్రారంభించింది.
ఆమె 1952లో మెహెర్‌బాబాను దర్శించుకుంది.
1953 నుండి 1986 దాకా **అవేకనర్ బై మంత్లీ జర్నల్‌ను**
అద్భుతమైన వ్యాసాలతో, అవతారుని సందేశాలతో ఆమె ప్రచురించింది.
మెహెర్‌బాబా స్వయంగా తన సందేశాలు, ఫోటోలు, ఇతర సమాచారం
ఎప్పటికప్పుడు ఈ పత్రికకు పంపారని సమాచారం.
1983 జూన్ మాసం – **అవేకనర్** 30వ వార్షికోత్సవ సంచికను
అవతారుని సేవలో, అవతారునికి అంకితమైన అతివల గురించి
ప్రత్యేక సంచికగా ప్రచురించారు.
ఈ సంచికలో ప్రిన్సెస్ నోరినా మాచబెల్లీతో తన పరిచయాన్ని,
అవతారుని సేవలో ఆమె తరించిన వైనాన్ని కడు రమణీయంగా ఫిలిస్ రాశారు.
ఆ రచన ఆధారంగా మెహెర్‌బాబా పాఠకుల కోసం
ఈ సంచికలో నోరినా గురించి ప్రత్యేక వ్యాసాన్ని అందజేస్తున్నాం.
దయచేసి పరిశీలించండి.

ఆమె అసలు పేరు నోరినా గిల్లీ.
ఇటలీ దేశంలోని ఫ్లోరెన్స్ ప్రాంతంలో 1880లో జన్మించింది.
యూరపులోని ఆరుగురు అపురూప సుందరీమణులలో నోరినా ఒకరిగా ప్రతీతి.
ఆమెకు అతి చిన్న వయస్సులోనే క్షయవ్యాధి సోకితే,
ఆ వ్యాధి నయం చేయించడం కోసం ఆమె తల్లితండ్రులు ఆమెను
స్విట్జర్లాండ్‌కు పంపారు.
అక్కడ వుండగానే ఒక ప్రముఖ నాటక సంస్థ ఆమెను అందం,
వర్చస్సు పట్ల ఆకర్షితులై వారి నాటక సమాజంలోకి ఆహ్వానించారు.
The Miracle అనే నాటకంలో **అందాలరాశి మడోనా** పాత్రను
అవలీలగా పోషించింది. ఈ స్త్రీ పాత్రకు తగినవారు దొరకక
నాటక సంస్థవారు అనేక అగచాట్లు పడుతున్న సందర్భంలో
వారికి నోరినా తటస్థించింది.
ఐతే, ఆమె అప్పటికి నాటకాలలో అనుభవం ఏమీ లేదు.
ఐనప్పటికీ లండన్ మహానగరంలో 1912లో ఆమె ఇచ్చిన తొలి ప్రదర్శనకు
స్థానికుల నుండి విశేష ఆదరణ లభించింది.
The Miracle అనే నాటకంలో ఆమె మడోనా పాత్రధారి.
మూకాభినయనం.
యూరోప్‌లో సుమారు 1000 సార్లు పైగా మడోనా పాత్ర ప్రదర్శనలిచ్చింది.
ఆ పిదప, న్యూయార్క్ సిటీలోనే మూకాభినయన శిక్షణా పాఠశాలను నెలకొల్పింది.
ఆమె ఆనాటి మూకీ ఇటాలియన్ సినిమాలలోనూ నటించింది.
1917 ప్రాంతంలో జార్జియా దేశ రాజవంశీయుడైన
ప్రిన్స్ జార్జెస్ మాచబెల్లీని పెళ్ళి చేసుకుంది.
1924 ప్రాంతంలో ప్రిన్స్ జార్జెస్ మాచబెల్లీ దంపతులు అమెరికా వచ్చి,
పెర్‌ఫ్యూమ్ మాన్యుఫాక్చరింగ్‌లో స్థిరపడ్డారు.
ప్రిన్స్ జార్జెస్ మాచబెల్లీకి పెర్‌ఫ్యూమ్ తయ్యారీలో విశేష అనుభవం వుంది.
వారు ఈ వ్యాపారంలో మంచి లాభాలు గడించారు.
జార్జియా దేశ రాజుకి భార్యగా, అందాలరాశిగా అత్యంత ఆదరణ పొందినా,
ఎంత ధన సంపద వున్నా, ఆమె మనస్సు ఆధ్యాత్మికత వైపు ఆకర్షితురాలైంది.
ఈ సమయంలోనే తొలిసారిగా తన స్నేహితురాలు
ఎలిజెబెత్ పాటర్‌సన్ ద్వారా మెహెర్‌బాబా
త్వరలో అమెరికా వస్తున్నారని తెలుసుకుంటుంది.
తీరా మెహెర్‌బాబా అమెరికా వచ్చాక,

ఆయన్ని కలవడానికి ఆమె ఏమాత్రం ఇష్టపడలేదు.
ఆయన తనకుతానుగా ఆధ్యాత్మిక గురువుగా ప్రకటించుకుంటే,
అలాంటి వారి పాదాలపై ఎలా ప్రణమిల్లుతాం? అని
తన స్నేహితుల్ని ప్రశ్నించిందామె.
అలాంటివాళ్ళని తాను నమ్మలేనంది.
తన స్నేహితులతో హేళనగా మాట్లాడింది.
ఎంతో కొంత ఆధ్యాత్మిక వాసనలు గల మనలాంటి ఆడవారికి
ఆ మాదిరి గురువులతో పనిలేదని వాదించింది!!
ఆయనేమీ భగదన్వేషణ మార్గం చూపవల్సిన పన్లేదన్నది.
మెహెర్‌బాబా ఒక అరుదైన ఆధ్యాత్మిక శక్తి అని ఆమె మరో
స్నేహితురాలు జీన్ అడ్రిల్ చెబుతూ..
మెహెర్‌బాబాని దర్శించినంతనే హృదయం ఆర్ద్రమౌతుంది.
కన్నీరు మున్నీరుగా కళ్ళంబడి దారలుకడతాయి అని చెప్పింది.
ఓ అలాగా!
మీ గురువుని చూడటానికి నేనూ తప్పక వస్తాను.
నేనూ ఎక్కెక్కి ఏడుస్తానులే అని ఎకసెక్కంగా నోరినా ఆనాడు మాట్లాడింది!
ఆ దరిమలా,
అమెరికాలో మెహెర్‌బాబా అడుగిడిన సమయం నుండీ
నోరినా కన్నీటి ధార ఆగలేదు.
ఆమె ఎందుకో తెలియని వేదనతో రోదించింది!!
ఆ ఆవేదనని అదుపు చేసుకోలేకపోయింది.
ఎలిజెబెత్ పాటర్‌సన్‌తో కల్సి హర్‌మన్, హడ్సన్ ప్రాంతంలో
బసచేసిన బాబావారిని నోరినా దర్శించుకుంది.
తొలి దర్శనంలోనే ఆమె అవతారునికి సంపూర్ణంగా అంకితమయ్యింది.
ఆ దర్శన సమయంలో బాబా కూడా ఆమెకు
అంతర్గతంగా తన దివ్యానుభూతిని అందజేశారు.
ఆమెకు తనతో గల గత జన్మల అనుబంధాన్ని బాబా గుర్తుచేశారు.
**రెండు జన్మలలో నీవు నాకు తల్లివి.**
**ఒక జన్మలో తండ్రివి,**
**"You have been my mother twice and my father once"** అని
మెహెర్‌బాబా తనతో చెప్పినట్లు నోరినా తరచు
తన గురించి చెప్పుకునే సమయంలో గుర్తుచేసుకునేది.

అలాగే ఆమె జీసస్ క్రీస్తు తండ్రి - జోసఫ్ అని బాబా చెప్పారామెకు.
బాబా దర్శనమయ్యాక, నీవు నాకు విధేయురాలిగా వుండగలవా? అని అడిగారు.
ఆమె ఏమాత్రం ఆలోచించకుండా తన అంగీకారం తెలిపింది.
ఐతే, వెళ్ళి ఇంటి గుమ్మం ముందర నిల్చోమన్నారు.
అలా అక్కడనే వుండి తనను దర్శించుకుని వెనుతిరుగుతున్న
వారి దగ్గర విరాళాలు సేకరించమన్నారు.
ఒక దేశ రాజు గారి భార్య,
మహారాణిగా, అత్యంత సంపన్నురాలు నోరినా నోరెత్తలేదు.
నూటికి నూరు శాతం బాబా ఆదేశాలు విధేయతతో పాటించింది.
ఒక పేదవాడు బాబాను దర్శించుకుని తిరిగి వెళ్తూ
తన దగ్గరున్న బస్ టికెట్ కోసం ఉంచుకున్న డబ్బుని
బాబాకు విరాళంగా ఇచ్చాడు.
మరో గొప్ప ధనవంతుడు, మత ప్రచారకుడొకరు
జేబులు తడుముకుంటూ వెళ్ళిపోయాడని నోరినా ఆనాటి అనుభవాలు చెబుతుంది.
సాధారణంగా మెహెర్‌బాబా విరాళాలు ఎవరినీ అడగరు.
ఈ విరాళాల సేకరణకు నోరినాను ఆనాడు నియమించడం
ఆమె విధేయతకు పరీక్ష అని మనం భావించాలని ఫిల్లిస్ ఫ్రెడ్రిక్ అంటుంది!!
నోరినా చిన్ననాటి స్నేహితురాలు ఆమె అందచందాలను వర్ణిస్తూ
నోరినా చాలా అందమైంది.
ఎత్తుగా, సన్నగా అపురూప అందాల సుందరిగా అగుపించేది.
ఒక సందర్భంలో నేను,
మెహెర్‌బాబా, మెహెరా, నోరినాలను ఒకేచోట నిలబడి వుండగా చూశాను.
ఆ ముగ్గురూ ఒక అందాల త్రయంగా నాకగుపించారని ఆమె అభివర్ణించింది.
ఆమె అవతారునిలో దివ్యానుభూతిని అనుభవించిందామె.
1936లో ఎలిజబెత్‌తో కలిసి నాసిక్ ఆశ్రమంలో వుందామె.
ధనవంతుల్లో అత్యంత ధనికురాలు ప్రిన్సెస్ నోరినా.
ఐనప్పటికీ, బాబా సమక్షంలో - విధేయతతో
ఒక సామాన్యురాలిగా ఆమె మెలిగింది.
ఆశ్రమ అవసరాలను సమకూర్చే పనిని బాబా అప్పగించిరామెకు.
**'నేను'** అనే అహంకారం మీలో తొలగించడమే నా ప్రత్యేకత అన్నారు బాబా.
ఒక ఇంగ్లీషు పత్రిక విలేఖరితో బాబా మాట్లాడుతూ - చమత్కారంగా -
Other ashrams are a vacation- nice, quiet meditation, yoga etc.

Here we do real work. Painful work on the ego, of course.
నాసిక్ ఆశ్రమంలో వుండగా,
ఓ రోజున బాబా నోరినా గది కిటికీ
దగ్గర నిల్చుని ఉన్నారు.
అంతక్రితం వరకూ నోరినా కలల ఒడిలో ఓలలాడుతోంది.
బాబా ఆమె కేసి చూస్తూ ఏమా కల? అని అడిగారు.
అదా? అని చెప్పడానికి సంశయించిందామె.
అదొక శృంగార స్వప్నం.
అందుకే ఆమె త్వరగా బయపడలేకపోయింది.
బాబా నవ్వుతూ ముందుకు సాగుతూ...
ఆరవ భూమికలో వున్నవారికి కూడా కామపూరిత ఆలోచనలుంటాయన్నారు.
ఆ దరిమలా నోరినా భర్త కూడా బాబాను దర్శించుకున్నాడు.
అతనితో బాబా మాట్లాడుతూ నీ తుదిశ్వాస సమయంలో
'నీవు నా నిజ స్వరూపం దర్శించుకుంటావన్నారు.
అదేమాదిరిగా ఆయన మరణశయ్యపై వుండగా 'క్రీస్తు'గా
బాబా దర్శనం పొందాడని నోరినా చెప్పింది.
ఆ తర్వాత ఫర్ఫ్యూమ్ కంపెనీని నోరినా అమ్మివేసింది.
ఆ వచ్చిన సొమ్ములో నోరినా తన భాగం బాబాకు అందజేసింది.
నాసిక్ ఆశ్రమం నెలకొల్పడంలో ఈ ధనం సహాయపడింది.
నోరినా 1933లో తొలిసారిగా మెహెరాబాద్‌కు వచ్చింది.
మహారాణి నోరినా భారత్‌లో ముంబయి ఓడరేవులో అడుగిడగానే,
నాటి స్థానిక పత్రికలు పతాక శీర్షికలతో ఆమె గురించిన వార్తలు ప్రచురించాయి.
ఈ ప్రచారాన్ని అడ్డుకునేందుకు 'ప్రిన్సెస్' అనే పదాన్ని
తొలగించుకోవాలనుకుంది నోరినా.
ఐతే అందుకు బాబా అంగీకరించలేదు.
ఆ పదం తన ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అక్కరకొస్తుందన్నారు.
నోరినా బహుభాషా కోవిదురాలు.
ఇంగ్లీషు, జర్మన్, రష్యన్, ఇటాలియన్, ఫ్రెంచి
భాషలలో అనర్గళంగా అమె ప్రసంగించేది.
నోరినా తన రాచరిక పరిచయాలతో ఎందరో ప్రముఖుల్ని
బాబాకు పరిచయం చేసింది.
మండలివారు తమకు తెలియదంటారు కానీ...

ప్రముఖ శాస్త్రవేత్త - ఐన్‌స్టీన్‌ని బాబాకు పరిచయం చేశానని
నోరినా తమతో చెప్పిందని ఫిలిస్ ఫ్రెడ్రిక్ తన వ్యాసంలో తెలియజేస్తుంది.
అలాగే ఒక ప్రముఖ ఇటాలియన్ తత్త్వవేత్తను ఆమె బాబాకు పరిచయం చేసింది.
అతను భగవంతుడు, భగదవతారం గురించి విశేష ప్రసంగం
బాబా ఎదుట చేశాడు. దాంతో చికాకు పడిన బాబా
తన అక్షరఫలకాన్ని వేగంగా ఒక మూలకు గిరవాటు వేశారు.
దాంతో అతని కళ్ళు చెమ్మగిల్లాయి.
అవతారుని దివ్య దర్శనంతో వెనుతిరిగాడు.
జూలై 1937లో నాసిక్ ఆశ్రమం ఎత్తివేశారు.
ఆ తర్వాత బాబా కేన్స్ దేశ పర్యటనకు
స్త్రీ మండలితో కలిసి ముంబాయి నుండి ఓడలో వెళ్ళారు.
ఈ పర్యటనలో బాబా కాబిన్ బయట నోరినా కాపలాదారునిగా వుంది.
ఓడలో బాబా కాబిన్‌కు బయట కటిక నేలపైనే ఆమె విశ్రాంతి తీసుకుంది.
1938-41 మధ్య కాలంలో బాబాతో కల్సి ఎలిజిబెత్ - నోరినాలు
బ్లూ బస్ పర్యటనలో పాల్గొన్నారు.
నోరినా గొప్ప వక్త.
డా॥ సి.డి. దేశముఖ్‌తో కల్సి పలుచోట్ల ప్రసంగించేందుకు బాబా ఆమెను పంపారు.
1941లో బాబా ఈ ముగ్గురు స్త్రీలు -
ఎలిజిబెత్, నాడినే, నోరినాలను
తన నామవ్యాప్తి కోసం అమెరికాకు తిరిగి పంపారు.
నోరినా ప్రసంగం అనర్గళంగా, ఆసక్తికరంగా వుండేది.
ఆమె ప్రసంగం పట్ల ఆకర్షితులై బాబా పరిధిలోకి వచ్చిన వారెందరో వున్నారు.
అందులో తానూ ఒకరినని ఫిలిస్ చెబుతారు.
నోరినా తన ప్రసంగంలో లీనమయిపోయేది.
దీన్ని ఆమె Thought Transmission అనేది.
తాను బాబా సందేశాలపై ప్రసంగించే సమయంలో
బాబా తన హృదయంలో ప్రవేశించి,
తనతో బాబా మాట్లాడించేవారని ఆమె చెప్పేది.
మెహెర్‌బాబా స్వయంగా తన ద్వారా తన సందేశం ఇస్తున్నారనేదామె.
ఆ రోజుల్లో ఇదొక సంచలనాత్మక విషయం.
ఈ విషయంలో అనేక మంది అనేక వ్యాఖ్యలు చేశారు.
కొందరు ఆమె ప్రసంగాలను ఖండించారు.

నేరుగా బాబాకు కూడా ఫిర్యాదు చేశారు.
ఇందుకు జవాబుగా అన్నట్లు
'Norina serves me through spiritual thought transmission.
Nadine serves me through surrender and Elizebeth through sacrifice'
అని తంతి పంపారు. ఆమె వో ఆధునిక కవయిత్రి, బాబా ఎడల ఆమె ప్రేమ, ఆరాధన అనితర సాధ్యం. మెర్టిల్ బీచ్‌ను ఒక అత్యంత సుందర ప్రదేశంగా తీర్చిదిద్దడంలో నోరినా పాత్ర ప్రశంశనీయం.
మెహెరాజాద్ తర్వాత మెర్టిల్‌బీచ్ సెంటర్ తనకు అత్యంత ఇష్టమైన నివాసంగా భావిస్తానని బాబా అన్నారు.
1947 నాటికి ఆమె ఆరోగ్యం క్షీణించింది. రక్తపోటు, అధికంగా ఉండింది. గుండె పరిమాణం నాలిగింతలు పెరిగిందని వైద్యులు ధృవీకరించారు.
ఎక్కువ విశ్రాంతి అవసరమన్నారు డాక్టర్లు.
అంతవరకూ ఆవిడ ప్రసంగంలో వచ్చిన
Thought Transmission శక్తి తగ్గింది. దాంతో మానసికంగా ఆమె క్రుంగిపోయింది.
బాబా నవజీవనం ప్రారంభించడానికి ముందు 1947లో నోరినాను – ఎలిజెబెత్‌లను మెహెరాజాద్‌కు ఆహ్వానించారు.
ఆరోగ్యం అంతంతమాత్రంగా వున్నా వైద్య సలహాలు
ప్రక్కన పెట్టి ధైర్యంగా బాబా దగ్గరకు వచ్చిందామె. బాబా కూడా విశ్రాంతి తీసుకోమని సున్నితంగా హెచ్చరిస్తూనే, ఆరు వారాలు మౌనం పాటించమని కోరారు.
ఆమె ఉండగా మెహెరాజాద్‌లో ప్రతిరోజూ ఆమెను బాబా పలకరించారు, పరామర్శించారు. ఆ తర్వాత తిరిగి అమెరికా వెళ్ళి, న్యూయార్క్‌లో బాబా సందేశాల ప్రసంగాలు పున:ప్రారంభించింది. ఆనాటి ప్రముఖ జ్యోతిష్కులు ఆమె త్వరలో తుదిశ్వాస విడుస్తుందని చెప్పారు. 1956లో బాబా మెర్టిల్‌బీచ్ ద్వితీయ పర్యటన తర్వాత, 1957లో ఆమె బాబాలో ఐక్యమయ్యింది. జ్యోతిష్కులు చెప్పే భవిష్యవాణి నా ప్రేమికులకు, నాకు విధేయులుగా వుండే భక్తులకు ఏమాత్రం పనిచేయవన్నారు. ఆమెకు నాలుగుసార్లు ప్రాణభిక్ష పెట్టి రక్షించానని బాబా అన్నారు. చిన్నతంలో టి.బి. వ్యాధి సోకినప్పుడు, ఆమెకు అంతర్లీనంగా జీసస్ దర్శనం లభించింది. నా ప్రేమికులెవరైనా నాకన్నా ముందుగా గనుక మరణిస్తే, ఆ వెనువెంటనే నా ప్రేమిక కుటుంబంలో జన్మిస్తారని బాబా సూచించారు.
అవును !!
ఆమె బాబా ప్రేమిక కుటుంబంలోనే జన్మించి వుంటుంది.
గమనించండి!!



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ

*(గత సంచిక తరువాయి)*

బాబా అందర్నీ ఆవేళ తాజ్‌మహల్‌కి తీసుకువెళ్ళారు.
సాయంత్రం కాసేపు వ్యాహ్యాళికి వెళ్ళివచ్చారు.
ఆలీ ద్వయం, రావ్‌సాహెబ్ కూడా బాబావారితో అలా తిరిగివచ్చారు.
షాహనే మామయ్య, బాబావారి పిలుపు మేరకి ఆగ్రా వచ్చాడు ఆ వేళ.
జూలై 22న అందరూ ఢిల్లీకి బయలుదేరారు.
మధుర మీదుగా వెడితే, ఢిల్లీ పెద్ద దూరం కాదు.
కానీ బాబావారు ఎందుకనో మధురా నగరం దారి వద్దు,
ఆలీఘడ్ మీదుగా వెడదాము అన్నారు.
ముందుగా టెలిగ్రాఫ్ ఆఫీసు కేసి పోనీ అన్నారు.
పాద్రీ సరేనన్నాడు.
టెలిగ్రాఫ్ ఆఫీసుకి దగ్గర మలుపు తిరిగితే సరిపోయేది.
కొత్తవూరు కావటంతో ఆ సందులు, మలుపులు తెలియక పాద్రీ దారితప్పాడు.
ఓ పది మైళ్ళు వెళ్ళాక తెలిసింది ఆ సంగతి.
అయ్యో! పొరపాటైంది బాబా అంటూ, పాద్రీ బస్సుని ఆలీఘడ్
దారి దారికి మళ్ళించాడు.
ఈ రోడ్డు బురద బురదగా వుంది.
అది రోడ్డు అనడం కంటే బురద దారి అంటే సబబు.
గత రెండు మూడు రోజులుగా భారీ వర్షాలు పడ్డాయేమో,
బండి నడవటం కష్టమైంది.
పదిమైళ్ళు దాటడానికి గంటకు పైనే పట్టింది.
ఎలాగైతేనేమి, మధ్యాహ్నానికి హథరస్ చేరారు.
ఆలీఘాడ్ మండలంలోనిదైనా
ఈ వూరికి తనకంటూ ఓ విశిష్టత వుంది.
ఇది బ్రజ్ భూమి,

భాష హిందీలా వినిపించే బ్రజ్ భాష.
కుషానులు, గుప్తులు, రాజపుత్ రాజులు, మరాఠీలు పాలించిన ప్రాంతం యిది.
కృష్ణ భగవానుడు తిరిగిన చోటు ఇది.
ఇక్కడ బలరాముడి పేరిట గుడి వుంది ఇప్పటికీ.
బలరాముడిని "దావూ బాబా" అని పిలుస్తారు.
**"లఖి మేళా"** జరుపుతారు,
ఏటా బలరామ నామస్మరణ చేస్తూ,
తులసీదాస్ హథరస్‌వాఢీ 18వ శతాబ్దంలో ఆయన వ్రాసిన తులసీ రామాయణం
ఇక్కడి వారి అందరి నోట వినిపిస్తుంది.
ఇప్పట్లో హథరస్ ప్రత్యేకత నేతి మిఠాయి.
మధురలో స్వీట్లను పాలతో చేస్తారు.
కానీ ఇక్కడ స్వచ్ఛమైన నెయ్యితోనే రకరకాల మిఠాయిలు తయారుచేస్తారు.
ఇదీ మా ప్రత్యేకత అంటారు.
మరి ఎందుకనో బాబావారు హథరస్ వాసుల ఆతిధ్యం స్వీకరించ లేదు.
ఆవాళ చాలా ముభావంగా కన్పించారు.
మండలివారి ప్రక్కన కూర్చోలేదు సరికదా దూరంగా కూర్చొన్నారు.
కాస్తంత ఎంగిలిపడ్డారు.
మరి మండలివారి మాట ఏమిటి?
వాళ్ళకి భోజనం ఆలీఘడ్‌లోనట.
ఆలీఘడ్ ఇప్పుడు చదువులకీ వ్యాపారాలకీ పెట్టింది పేరు.
ఆలీఘడ్ తాళాలు పేరు విని వుంటారు.
తాళాల తయారీకి ఓ కుటీర పరిశ్రమ ఇక్కడ వుంది.
స్థల పురాణం ప్రకారం,
ఆలీఘడ్‌లో ఓ రాక్షసుడు వుండేవాడట.
వాడిని కోల్ అనీ కోయిల్ అనీ పిలిచేవారట.
వాడు పెట్టే బాధలు భరించలేక స్థానికులు బలరాముడికి మొరపెట్టుకున్నారు.
"దావూబాబా మమ్మల్ని కోల్ బారినుంచి కాపాడవయ్యా" అని ప్రార్థించారు.
బలరాముడికి మద్దతుగా అహిర్‌లు కదిలారు.
దుష్ట శిక్షణ చేశాడు బలరామ దేముడు.
కోల్ సంహరణ జరిగింది.
కాబట్టి మీ వూరిపేరు ఇహపైన "కోల్"గా ప్రసిద్ధి చెందుతుంది అన్నారు.
కాలక్రమంలో కోల్ ఆలీఘడ్‌గా మారింది అని బ్రిటీషు చరిత్ర కారుడు

ఎడ్విన్ అట్కిన్ సన్ కథనం.
రాజపుత్ వంశానికి చెందిన దొరలు స్థాపించారీ ఆలీఘడ్ నగరాన్ని
అని ఇంకొందరు అంటారు. ఇక్కడ బౌద్ధమతం కూడా విరాజిల్లింది.
ఇంత చారిత్రక ప్రసిద్ధి చెందిన ఆలీఘడ్ నగరంలో
కొత్త అధ్యాయానికి బాబావారు శ్రీకారం చుట్టారు.
అది ఎలా జరిగిందీ అంటే పాఠక మహాశయా,
సావధానంగా వినండి.
ఆలీఘడ్ చేరాక, మండలివారు భోజనానికి కూర్చొన్నారు.
బాబావారు వాళ్ళకి కొంచెం దూరంగా ఓ చెట్టు క్రింద చతికలపడ్డారు.
హథరస్‌లో వున్నట్లే ముభావంగా కన్పించారు.
విష్ణు భోజనానికి కూర్చొంటూ షర్టు తీసి ప్రక్కన పెట్టాడు.
ఇది బాబావారు చూశారు. కోపగించుకున్నారు. షర్టు విప్పేసేవేం?
ఓ ప్రక్క చలిగాలి వీస్తోంది, షర్టు వేసుకోవాలి కానీ
ఇప్పుడు విప్పకూడదు అని మందలించారు.
బాబావారు చెప్పారు కాబట్టి విష్ణు షర్టు వేసుకొంటాడు మళ్ళా అనుకొన్నారు అందరూ.
అతగాడు అలా చేయలేదు సరికదా,
బాబావారి మాటని పట్టించుకోలేదు.
ఏమయింది విష్ణుకీవాళ అని ముక్కున వేలు వేసుకొన్నారు మండలివారు.
ఇంతకీ విష్ణు ఏమన్నాడో తెలుసా పాఠకమహాశయా!
"మేము బ్రాహ్మణులం".
భోజనం చేసేటప్పుడు షర్టు వేసుకో కూడదు.
అది మా అచారం. అందుకనే షర్టు తీసేశాను" అన్నాడు.
బాబావారికి చిర్రున కోపం వచ్చింది.
గట్టిగానే చివాట్లు పెట్టారు.
"జలుబు, దగ్గు పట్టుకొంటే సరి,
ఆచారం గీచారం ఎగిరిపోతాయి.
అయినా ఏమిటి నీ ఉద్దేశం.
నాకంటే ఎక్కువా నీకు నీ ఆచారం.
నామాట వినని పక్షంలో నువ్వు నాతో వుండటం శుద్ధ దండగ" అన్నారు.
విష్ణు ఖంగుతిన్నాడు.
నేనేమి తప్పు మాట అన్నాను అబ్బా!
బాబావారు గట్టి శిక్ష విధిస్తామంటున్నారు అనుకొన్నాడు.

మనస్సులో మాట చెప్పాడు.
మీరు చెప్పినట్లు చేస్తాను బాబా అన్నాడు.
మీ మాట శిరసావహిస్తానన్నాడు.
మీరు చెప్పారు కాబట్టి భోజనంకి ముందు షర్టు విప్పను ఇహ ఎప్పుడూ అన్నాడు.
కొంచెం నసుగుతూ మరోమాట చెప్పాడు.
అలవాటయిపోయింది బాబా, ఇలా షర్టు విప్పి భోజనానికి కూర్చోవడం.
నాకీ ఆచారం ఇష్టమనీ కాదు, నేను నమ్ముతాననీ కాదు.
ఏదో అలవాటయిపోయింది!
మీరు మానేయమంటే మానేస్తాను అంటూ ప్రక్కనే వున్న షర్టు తీసుకొన్నాడు.
తమ మాట వింటున్నందుకు బాబావారు సంతోషించారు.
అన్నం తింటున్నా కదా,
లేచి చేతులు కడుక్కుని షర్టు వేసుకుందామన్న ఆలోచన రాలేదు అతగాడికి.
బాబావారికి కోపం వచ్చింది,
ప్రభువు మాట వెంటనే పాటించాలన్న హడావుడిలో
షర్టు తలపై నుంచి ఎక్కించుకోబోయాడు.
ఒక చేతితో అన్నం కలుపుకొంటున్నాడు కదా,
ఒంటి చేత్తోనే షర్టు వేసుకోబోయాడు.
ఒకపట్టాన కుదరలేదు సరికదా,
చేతిలో అన్నం షర్టుపై పడింది.
షర్టు అన్నం కంచంలో పడింది.
ఇది చూసి అందరూ ఫక్కున నవ్వారు.
వాళ్ళ నవ్వుతో జతకలిపాడు విష్ణు.
మీకేమి నవ్వుతారు, చిన్నప్పట్నుంచి వచ్చిన అలవాటు యిది.
సరే ఈవాళ్టితో ఈ అలవాటుకి స్వస్తి" అని విష్ణు
అంటుంటే మరిన్ని నవ్వుల జల్లులు కురిసాయి.
అలా భోజనాలు ముగిశాక మళ్ళీ రోడ్డు పట్టారు.
ఓ పదిమైళ్ళు వెళ్ళగానే, బాబావారు బస్సుని ఆపించారు.
బాబావారు బస్సు దిగారు.
మీరూ రండి అనగానే,
ఆలీల ద్వయం, రావ్ సాహెబ్ కూడా బస్సు దిగారు.
కాసేపు అటూ ఇటూ పచార్లు చేశారు.
బస్సు ఎక్కారు.

ఎందుకు చేశారు ఇలా బాబా అని మండలివారు అడగలేదు.
బాబావారు ఇదిగో ఫలానా కారణంవల్ల బస్సును ఆపించాను అని చెప్పలేదు.
అయినా ఇదేమయినా కొత్తనా మండలివారికి. బాబావారు ఎప్పుడు ఏపని చేసినా దానికో ప్రత్యేకత వుంటుందని మాత్రం వాళ్ళకి తెలుసు.
ఒక్కోసారి ఆ ప్రత్యేకతని బాబావారే స్వయంగా వివరిస్తారు.
ఒక్కోసారి చెప్పరు. వీరూ అడగరు,
ఈవేళ్టిలాగా అన్నమాట.
సరే, ఇహ బస్సు ఢిల్లీ దారిన వేగంగా దూసుకుపోయింది.
రాజధాని నగరం చేరేసరికి రాత్రి తొమ్మిది అయ్యింది.
బస రాజ్‌మహల్ అన్న హోటల్‌లో.
పాఠకులకి తెలుసుగా ఢిల్లీలో చూడదగ్గ ప్రదేశాలు ఎన్నో.
పాత ఢిల్లీ ముస్లిమ్ సంప్రదాయాలకీ అద్దంపడితే,
కొత్త ఢిల్లీ బ్రిటీషు రాచరికపు సొగసులతో వయ్యారంగా దర్శనమిస్తుంది.
ఈ పాత కొత్తలని దాటి వెడితే,
మరింత పాతకాలపు విశేషాలు దర్శనమిస్తాయి.
ఇవన్నీ బాబావారు దగ్గరుండి చూపించారు.
ఉదయం ఎనిమిదింటికే హోటలు నుంచి కదిలారు.
ముందుగా పాత ఢిల్లీ,
ఆ తర్వాత కొత్త ఢిల్లీ ప్రాంతాలకి తీసుకువెళ్ళారు.
ఎర్రకోట, కుతుబ్‌మీనార్ చూపించారు.
నగర సందర్శన పూర్తయే సరికి పన్నెండు అయింది.
పోస్టాఫీసు నుంచి ఉత్తరాలు వచ్చాయి.
మెహెరాబాద్, అహ్మద్‌నగర్‌లకి వచ్చిన ఉత్తరాలవి.
బాబావారు ఢిల్లీ చేరే రోజు తెలుసు కాబట్టి
ఆ ఉత్తరాలు పోస్టు మాస్టరు పేరిట పంపారు.
ఓపికగా ఉత్తరాలన్నింటినీ చదివారు.
జవాబులు పంపారు.
ఛగన్‌ని పండరీపూర్ వెళ్ళమన్నారు.
షాహనే మామయ్య అక్కడికి వెడుతున్నాడు,
నువ్వు కూడా అతనితో వెళ్ళు అన్నారు.
పండరీపూర్‌లోనే వుండు కొంతకాలం అన్నారు.
అక్కడికి వెళ్ళాక వారం రోజులపాటు ఉపవాసం ఉండమన్నారు.

"మహాప్రసాదం! అలానే చేస్తానన్నాడు" ఆ భక్తుడు.
ఢిల్లీ తర్వాత మజిలీ లూధియానా.
పంజాబు రాష్ట్రంలో వున్న ఈ వూరు స్వెట్టర్లకి పెట్టింది పేరు.
సైకిళ్ళు కూడా తయారు చేస్తారిక్కడ.
ఒకటా రెండా, వందల వేల సైకిళ్ళు తయారవుతాయి ఈ ఊర్లో.
అందుకనే ఆసియాలో కల్లా అతిపెద్ద సైకిల్ పరిశ్రమ లూధియానాలోనే వుంది.
చిన్నా చితకా పరిశ్రమలు ఎన్నో వున్నాయి.
ఢిల్లీకి అంత దగ్గరేమీ కాదు.
191 మైళ్ళ దూరం.
ఎనిమిది గంటల ప్రయాణం.
బాబావారి బస్సు లూధియానా చేరే సరికి చీకటి పడింది.
లూధియానా ఆధ్యాత్మిక గురువు ఓ గుడ్డివాడట.
బాబావారే స్వయంగా చెప్పారీ సంగతి ఆవేళ మండలివారికి.
ఛగన్ పండరీపూర్ దారి పట్టడం వల్ల
వంట పని పాద్రీపై పడింది.
మండలివారు అందరూ తలోచేయి వేశారు.
వంట రెడీ అయింది.
వేడి వేడి భోజనం చేసి, అలసి సొలసిన ప్రాణులు నడుం వాల్చాయి.
కోడి కూయకుండానే అందరూ లేచారు.
ఇప్పుడు ప్రయాణం లాహోర్‌కి.
ఇప్పుడు పాకిస్తాన్‌లో వున్న ఈ నగరానికి
రాజకీయంగా, చారిత్రకంగా సాంస్కృతీ పరంగా విశిష్టత వుంది.
25వ తేదీ ప్రొద్దుటే బయలుదేరి పదకొండు గంటలకి అమృత్‌సర్ చేరారు.
సిక్కుల పుణ్యక్షేత్రం ఈ వూరు.
స్వర్ణ దేవాలయం ప్రత్యేక ఆకర్షణ.
దేశ విదేశాల నుండి సిక్కులు రోజూ ఇక్కడికి వస్తూంటారు.
ఒక్క సిక్కు మతస్థులే కాదు,
హిందువులు కూడా స్వర్ణ మందిరాన్ని దర్శించి తరిస్తుంటారు.
ఎందుకనో ఏమో బాబావారు గర్భగుడిలోకి అడుగు పెట్టలేదు.
గుడి ఆవరణలోనే చాలాసేపు నిలబడ్డారు.
గుడి అందాలని చూశారు.
అమృతసర్ నుంచి లాహోర్ పెద్ద దూరం కాదు.

అప్పట్లో లాహోర్ – అమృత్‌సర్‌లకి జంత నగరాలని పేరు.
సుమారు నాలుగు వేల సంవత్సరాల చరిత్ర గల పట్టణం.
శ్రీరామ చంద్రుని పుత్రుడు, లవుడు కట్టించాడు లాహోర్‌ను.
ఇప్పటికీ లాహోర్ కోటలో లవుడి పేర ఓ గుడి వుంది.
అక్కడ విగ్రహం ఏమీ లేదనుకోండి.
లాహోర్‌కి దగ్గరలో కసూర్ అన్న వూరు వుంది.
కుశుడు కట్టించాడు ఆ వూరుని అంటారు.
లాహోర్ రాజధానిగా ఎందరో రాజులు రారాజులు పరిపాలించారు.
మరి ఎందరో ఈ నగరాన్ని దోచుకొన్నారు.
ఘజనీ మహమ్మద్, నాదెర్‌షా, అహమ్మద్‌షా
ఇలా ఎందరో లాహోర్‌ని కొల్లగొట్టారు.
అందుకని బాబా ఫరీన్‌వారిస్‌షా అన్న కవి ఏమన్నాడంటే –
“మాకు అంటే ఏముంది చెప్పుకోడానికి తింటున్న తిండి,
కట్టుకున్న బట్ట తప్ప. మిగతావన్నీ అహ్మద్‌షాకే అంకితం” అన్నాడు.
భారత స్వాతంత్ర సమరంలో లాహోర్ ప్రముఖ పాత్ర వహించింది.
ఇక్కడ 1929 డిసెంబరు 31న జరిగిన కాంగ్రెస్ మహాసభలో
“మాకు పూర్ణ స్వరాజ్యం కావాలని జవహర్‌లాల్ నెహ్రూ గర్జించాడు.
స్వరాజ్ పతకాన్ని ఎగరవేశాడు.
మహమ్మదీయులకి పాకిస్తాన్ కావాలి అని అంటూ మహమ్మదాలీ జిన్నా
నాయకత్వంలో ముస్లిమ్ లీగ్ పార్టీ పాకిస్థాన్ శంఖారావాన్ని పూరించిందీ
లాహోర్ నుంచే. అది 1940లో జరిగింది.
స్వాతంత్ర్య సమరవీరుడు భగత్‌సింగ్‌ని బ్రిటీషువారు ఉరితీసిందీ
లాహోర్‌లోనే. మరోమాట ఈ పట్టణం రావీ నది ఒడ్డున వుంది.
ఇంత ఘనకీర్తి వున్న లాహోర్ నగరానికి
బాబావారి బస్సు చేరే సరికి సాయంత్రం ఆరు గంటలు అయింది.
చీకటి పడుతోంది. ఓ హోటల్‌లో దిగారు అందరూ.
వంట చేయటంలేదన్నాడు పాద్రీ.
ఎందుకుట అంటే బస్సుని కడుగుతున్నాను.
తీరికలేదన్నాడు. మరి విష్ణు మాట ఏమిటి?
అతను నాకు సహాయపడుతున్నాడు అన్నాడు.
సరే ఎక్కడైనా మంచి భోజన హోటల్ కనిపిస్తుందేమో చూద్దాం అన్నారు బాబా.
నగరంలో బస్సులు తిరగగూడదట.

ఇదో వింత నిషేధం.
ఏంచేస్తారు కాళ్ళకి పనిచెప్పారు.
చాలా దూరం తిరిగారు.
ఆరేడు మైళ్ళు తిరిగినట్లు తిరిగారు.
మంచి హోటలు కనిపించింది.
భోజనం రుచిగా వుంది.
హమ్మయ్య! కష్టం ఫలించింది అనుకుంటూ హాయిగా భోజనం చేశారు.
అలా 25వ తేదీ గడిచింది.
మర్నాడు అంటే 26వ తేదీన ఎంప్రెస్ హోటల్‌కి మారారు.
పేరుకి తగ్గట్లుగా మహారాణిలా వెలిగిపోతుంది ఆ హోటలు.
అంత మంచి హోటల్‌లో మండలివారు ఇంతవరకు బస చేయలేదు.
వాళ్ళ మొహాల్లో ఆనందం కనిపించింది.
ఇది గమనించిన బాబావారేమన్నారో తెలుసా పాఠకమహాశయా!
"ఈవేళ అమీర్, రేపు ఫకీర్" అన్నారు.
అమీర్ అంటే డబ్బున్నవాడు, ఫకీర్ అంటే నిరుపేద.
భోగభాగ్యాలు వున్నా, లేకపోయినా
ఒకేలా జీవించడం అవసరమని చెప్పారు.
పరిస్థితులు ఎలా వున్నా వాటికి తల ఒగ్గి వుండాలన్నారు.
పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా వుండవు.
ఈవేళ వున్నట్లు రేపు వుండదు,
రేపు వున్నట్లు ఎల్లుండి వుండదు.
పరిస్థితులు మారుతూ వుంటాయి.
అందుకని ఏంచేయాలి.
పరిస్థితులకు బానిస కాకూడదు.
నిర్లిప్తంగా అంటీ అంటనట్లు వుండాలి.
మనస్సు దృఢంగా వుంచుకోవాలి అన్నారు.
రోజల్లా బాబావారు సరదాగా కనిపించారు.
కాసేపు గ్రాంఫోన్ పాటలు విన్నారు.
మరి కాసేపు పేకాడారు.
సాయంకాలం ఎప్పటిలా వ్యాహ్యాళికి వెళ్ళారు.
ఆలీ ద్వయం – ఆఘా, అక్బరు ఆలీలు, రావ్ సాహెబ్ గారు బాబాకి తోడు కదిలారు.
జూలై 27వ తేదీన రావల్పిండికి బయలుదేరారు.

తొమ్మిదింటికి చేరారు అక్కడికి.
రాత్రి బస ఓ చెట్టుక్రింద.
లాహోర్‌లో రాజుల్లాగా దర్జాగా గొప్ప హోటలులో
వున్నారు నిన్న. ఈవేళ పేదవాళ్ళగా చెట్టుక్రింద నిద్ర.
లాహోర్ హోటలులో టేబుల్ భోజనం.
ఏమి కావాలి సార్, ఇంకేమయినా వడ్డించమంటారా అంటూ సర్వర్లు కొసరి
కొసరి వడ్డించారు. ఇప్పుడు ఆ హంగు లేదు సరికదా కటిక నేలపైన నిద్ర.
నిన్న అమీర్, నేడు ఫకీర్ అన్న బాబావారి ఉవాచ ఇంత త్వరగా అనుభవంలోకి
వస్తుందని మండలివారు ఊహించ లేదు.
ఇదంతా బాబావారి శిక్షణలో భాగమనుకొన్నారు.
చెట్టుక్రింద నిద్రలోకి జారుకొన్నారు.
బాబావారు మాత్రం బస్సులో పడుకొన్నారు.
28వ తేదీన కోహలాకి బయలుదేరారు. అంతా కొండ ప్రదేశం.
బస్సు చాలాసార్లు మొరాయించింది. పాపం ఏంచేస్తారు. మండలివారు త్రోసేవారు.
బండి కదిలేది. ఇలా చాలాసార్లు జరిగింది.
కోహాలా చేరేసరికి సాయంత్రం అయింది.
మండలివారు అలసిపోయారు.
ఆ వూరి డాక్ బంగళా (ప్రభుత్వ విశ్రాంతి గృహం)లో దిగారు.
మర్నాడు ప్రొద్దు ఎక్కకుండా మళ్ళీ రోడ్డున పడ్డారు.
జీలం నది ఒడ్డున వెడుతుంటే ఓ పండు ముసలి కనిపించాడు.
ఆకారం చూస్తే ముష్టివాడిలా వున్నాడు. కానీ ముఖం మాత్రం వెలిగిపోతోంది.
దూరం నుంచే బాబావారిని చూశాడు.
నమస్కరించాడు. తన దారిన వెళ్ళిపోయాడు.
ఒక్కమాట అంటే ఒక్కమాట అనలేదు. ఎవరూ ఏమిటి అని వీళ్ళని అడగలేదు.
బాబావారిని దగ్గర నుంచి చూస్తానని కానీ, ఆశీస్సులు తీసుకొంటానని కానీ అనలేదు.
ఇది అంతా వింతగా కనిపించింది మండలివారికి. అయితే ఇటువంటి
సంఘటనలు కొత్తకాదు వాళ్ళకి. గతంలో ఎన్నోసార్లు ఇలాగే జరిగింది.
బ్రహ్మైక్యం కేసి పరుగులు తీస్తున్నవారికి జగన్నాటక సూత్రధారి ఎవరో వేరేచెప్పాలా
ఏమిటి? అంతరాత్మ చెప్తుంది, పరమాత్మని చూపిస్తుంది,
ఇదొక యాధృచ్ఛిక సంఘటనలాగా. బస్సు కదుల్తూనే వుంది.
కాల చక్రభ్రమణం ఎవరి కోసం ఆగదని గుర్తుచేస్తోంది.

**(సశేషం)**

# అవతారుని ద్వితీయ షష్ఠిపూర్తి మహోత్సవాలు

బాబా ప్రేమికులందరూ, ప్రపంచంలో వారెక్కడున్నా అవతారుని జన్మదినోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ ఏడాది అవతారుని జన్మదినోత్సవాలకు ఓ ప్రత్యేకత ఉంది. ఇది అవతారుని ద్వితీయ షష్ఠిపూర్తి మహోత్సవ సమయమిది. 60 సంవత్సరాల క్రితం మెహెర్‌బాబా ఆంధ్రా పర్యటనలో ఉన్నారు. ఆనాడు ఫిబ్రవరి 25న పశ్చిమ గోదావరిజిల్లా తాడేపల్లిగూడెంలో అవతారునికి స్వయంగా షష్ఠిపూర్తి వేడుకలు జరుపుకునే భాగ్యం తెలుగువారికి లభించింది. ఆ వేడుకలలో పాల్గొన్నవారు, ఆనాడు అవతారుని దర్శించుకున్నవారు ధన్యులు. నేడు తిరిగి తాడేపల్లిగూడెంలో అవతారుని ద్వితీయ షష్ఠిపూర్తి వేడుకలు ఘనంగా జరుపుకున్నామని డాక్టర్ విజయసారధి తన లేఖలో తెలియజేశారు.అలాగే, విజయవాడకు మెహెర్‌బాబా విచ్చేసి 60 సంవత్సరాలు నిండిన సందర్భంగా విజయవాడ బాబా సెంటర్ వారు ఈ జన్మదిన వేడుకలలో భాగంగా ప్రత్యేక సత్సంగ్ కార్యక్రమాలు ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. బాబా తరపున అన్నట్లు బాబా సోదరుని కుమారులు సోరబ్, రుస్తుంలు ఆనాటి కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరయ్యారు.

# గుంటూరు

అలాగే, విజయవాడకు ప్రక్కనే జంటనగరంగా వున్న గుంటూరు పట్టణంలో బాబా పర్యటించారు. గుంటూరులో స్థానికంగా సాయిబాబా దేవాలయ నిర్మాణానికి అవతారుడు శంఖుస్థాపన చేశారు.

గుంటూరులో గొప్ప ప్రజా దర్శనం ఇచ్చారు. ఆ దరిమలా గుంటూరులో మెహెర్‌బాబా ప్రార్థనా మందిరాన్ని సుమారు ఒక ఎకరం విస్తీర్ణంలో నిర్మించారు. ఈ నిర్మాణం పూర్తయి మార్చి ఒకటి నాటికి 50 సంవత్సరాలు నిండాయి. బాబా వారి జన్మదినోత్సవాలుతో పాటు గుంటూరు మెహెర్ సెంటర్ స్వర్ణోత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండే కాకుండా కర్నాటక, మహారాష్ట్ర మరి ఇతర ప్రాంతాల నుండి మెహెర్ ప్రేమికులు అత్యధిక సంఖ్యలో ఈ వేడుకలలో పాలుపంచుకున్నారు. పూనే నుండి ప్రతాప్ ఆహిర్, ముంబాయి నుండి బాబా సోదరుని కుమారులు సోరబ్ రుస్తుంలు ప్రత్యేక అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దక్షిణ్‌కి ఆత్మ పేరిట గుంటూరు సెంటర్ ఆవిర్భావ విశేషాలుతో కూడిన చిన్న పుస్తకాన్ని శ్రీ కనకయ్య ప్రచురించారు. గుంటూరు పట్టణంలో ఆనాడు నిర్వహించిన శోభాయాత్ర పలువుర్ని ఆకట్టుకుంది. బాబా ప్రేమికులు శ్రీ తోట నాగేశ్వరరావు, శ్రీ బి. రామక్రిష్ణయ్య, శ్రీ బి.వి. సుబ్బారావు, శ్రీమతి సుబ్బలక్ష్మి, శ్రీమతి శివనాగేశ్వరీ

ప్రసాద్, శ్రీ కె. రామకృష్ణ మెహెర్‌లు బాబా సందేశాలపై, బాబా ఆంధ్రా పర్యటన విశేషాలను గుర్తుచేస్తూ ప్రసంశనీయమైన ప్రసంగాలను చేశారు. శ్రీ వల్లూరి నాగేశ్వరావు రచించిన చిన్న నాటిక, కుమారి నిఖిత మెహెర్ నృత్యం, యూ ఎలోన్ ఎగ్జిస్ట్ చలన చిత్రం ఆహుతులను అలరించాయి. గుంటూరు సెంటర్ స్వర్ణోత్సవాలు, బాబా జన్మదినవేడుకలు అత్యంత వేడుకగా, మరో 50 ఏళ్ళు మరచిపోలేని రీతిలో జరిగాయని మా ప్రతినిధి తెలియజేశారు.

## హైదరాబాద్‌లో

హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలలో అవతారుని జన్మదిన వేడుకలు కడు రమ్యంగా జరిగాయి. హైదరాబాద్‌లోని జూబ్లి బాబా సెంటర్ వార్షికోత్సవం 2013 నవంబరు 14న జరుపుకుంటూ, ఆందుకు కొనసాగింపుగా మరుసటి సంవత్సరం ఫిబ్రవరి 25 దాకా బాబా జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఇక్కడ ఆనవాయితీ. ఈ 120 రోజులూ ప్రతి బాబా ప్రేమికుని ఇంట సత్సంగ్, బాబా ప్రేమిక సందేశంపై ప్రసంగ ఏర్పాటు, భజన గీతాలు ప్రతి రోజూ సాయంత్రం రెండు గంటల కార్యక్రమం ఏర్పాటు జరుగుతుంది. కోఠి సెంటర్‌లో జరిగే ప్రతి శనివారం సత్సంగ్‌కు విశేష సంఖ్యలో బాబా భక్తులు హాజరవుతారు. అలాగే ఈ జన్మదినోత్సవాలలో ప్రతి రెండవ శనివారం ఖోజాగూడాలో బాబావారు జరిపిన మనోనాశ్ కొండ గుహ దగ్గర సత్సంగ్ కార్యక్రమాలు, బాబ నామంతో ఏకాహం, నగర సంకీర్తన కార్యక్రమాలు ఈ ఏడాది నిర్వహించారు. మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్ సెంటర్‌ల పరిధిలో జన్మదినవేడుకలు ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకలకు ముగింపుగా మార్చి 2న రక్తదాన శిబిరం నిర్వహించారు. గత 120రోజులుగా ప్రతి నిత్యం ఏర్పాటు చేస్తున్న కార్యక్రమాలలో పాల్గొంటూ కార్యక్రమ నిర్వహణలో పాలుపంచుకున్నవారెందరున్నా, బాబా ప్రేమికలు శ్రీ పిడుగు అప్పారావు, నోరి కుటుంబీకులు అభినందనీయులు.

## శ్రీకాకుళం

అవతార్ మెహెర్‌బాబా 120వ జన్మదినోత్సవం సందర్భముగా 23,24,25 తేదీలలో స్థానిక అవతార్ మెహెర్‌బాబా, కత్తెరవీధి కేంద్రములో జన్మదిన వేడుకలు, సేవా, సాంస్కృతిక కార్యక్రమాలు, మెహెర్ ప్రేమిక సహవాస్ నిర్వహించినట్లు పి.వి. రంగప్రసాదరావు, తెలిపారు.

## రాజాం

అవతారుని జన్మదిన వేడుకలు రాజాం సెంటర్‌లో 05.02.2014 వరకు ఘనంగా నిర్వహించాం. అవతారుని బర్త్‌డేని 25.02.2014 నాడు ప్రత్యేక కార్యక్రమాలను సెంటర్‌లో ఏర్పాటు చేసాం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా శ్రీ డి. శ్రీనివాసరావు, ప్రొఫెసర్ వి. క్రిష్ణమోహన్, రిజిస్ట్రార్, డా.బి.ఆర్. అబేద్కర్ యూనివర్సిటీ, యట్చర్ల విచ్చేసారని అధ్యక్షులు శ్రీ రమణమూర్తి తెలిపారు.

# జొన్నాడ

ఆలమూరు మండలం జొన్నాడ గ్రామం అవతార్ మెహెర్‌బాబా సెంటర్‌లో 120 రోజులు బాబా జన్మదినోత్సవాు 120 రోజులు ఘనంగా జరుపుసందర్భంగా అఖండ నామం చేసుకొని హంస వాహనంపై పుర ప్రజలను పులకరింపజేస్తూ నగరమంతా నాట్యం చేస్తూ నగర సంకీర్తన చేసినారు.

# విజయవాడ

విజయవాడ బాబా సెంటర్‌లో 04.02.2014 నుండి 25.02.2014 వరకు జన్మదినోత్సవాలు ఘనంగా జరుపుకున్నాము. 2014 ఫిబ్రవరి 21 నాటికి విజయవాడలో ప్రజాదర్శనం ఇచ్చి 60 సంవత్సరాలు నిండిన సందర్భంగా ప్రేమిక సహవాస్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసినాము. బాబా సందేశాలపై శ్రీ ఎ.వి.జి. హరిప్రసాద్ ప్రసంగించారు. స్థానిక నవజీవన్ సంస్థలోని పేద విద్యార్థులకు దుప్పట్లు అందజేశాము. శ్రీ జి. రామారావు, కుమారి మౌని, తదితరులు పాల్గొన్నారని కార్యదర్శి శ్రీ ఎన్. శర్మ ఒక ప్రకటనలో తెలిపారు.

# హిందూపురం

14.02.2014 శుక్రవారం అవతార్ మెహెర్‌బాబా 120వ జయంతి ఉత్సవాల సందర్భంగా హిందూపురం కుంచం విశ్వనాధయ్యగారి స్వగృహంలో ఉ. 5.30 ని.ల నుండి రాత్రి 7 గ.ల వరకు బాబా కార్యక్రమాలు జరిగాయి. ఎ.వి.జి. హరిప్రసాద్, బెంగుళూరు అవతారుని అవతరణ గురించి ప్రసంగించినారు. ఆ తరువాత బాబా ఏకనామం జరిగింది. ఈ కార్యక్రమానికి ధర్మవరం, పావగడ, బెంగుళూరు, హైదరాబాదు నుండి పండగ రమణ, సత్తయ్య, రామాయంపేట నుండి రామచందర్ పలువురు బాబా ప్రేమికులు హాజరయ్యారని శివప్రసాద్, కార్యదర్శి, హిందూపూర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# వరంగల్లు

31.01.2014 శుక్రవారం రోజున ప్రియతముని దివ్య అమరతిధి పర్వదినమున, ప్రేమిక సమ్మేళనము నిర్వహించుకొని 11.45 నుండి 12.00 వరకు మెహెర్ ధున్ మరియు 12.00 నుండి 12.15 వరకు మౌనము, బాబా కృపతో జరుపుకున్నాము. బాబా సత్యప్రేమ సందేశములతో కూడిన బాబా పాటలను పాడుకొని అవతారుని ప్రేమ సుధలను ఆస్వాదించగలిగినాము.

# ఖమ్మం

అవతార్ మెహెర్‌బాబా ఖమ్మం సెంటర్‌లో బాబా 120వ జన్మదినోత్సవముల సందర్భంగా ది: 03.02.2014 నుండి ది: 24.02.2014 వరకు ప్రతిరోజు భజనలు జరిగినవి. ఈ కార్యక్రమంలో భాగముగా వృద్ధాశ్రమములలో పండ్లు, స్వీట్లు పంచిపెట్టడం జరిగింది. మానసిక వికలాంగుల ఆశ్రమంలో పిల్లలకు భోజనము పెట్టబడినది. సామంత్రం 3 గంటల వరకు సామూహిక భోజన కార్యక్రమములో సుమారు 800 మందికి భోజన ఏర్పాటు చేయబడినదని ఆర్. రామచంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

# తాడేపల్లిగూడెం

జనవరి 1వ తేదిన ప్రారంభించి మార్చి 1వ తేది వరకు 60 రోజులు బాబా 2వ షష్ఠిపూర్తి ప్రత్యేక కార్యక్రమములు చాలా వైభవంగా నిర్వహించాము. ఈ కార్యక్రమంలో ప్రతి రోజూ సత్సంగ్‌లో సుమారు 30 నిముషాలు డా॥ విజయసారధి బాబా సందేశాలపై ప్రసంగించారు. జనవరి 31వ తేది అమరతిథి ఉ. 9 గ.ల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు 350 మందితో ప్రత్యేక కార్యక్రమము నిర్వహించాము.

బాబా అంతిమ ఘడియలలో పడిన బాధని వర్ణించగా ప్రేమికులు అశృనయనాలతో విన్నారు. ముఖ్యముగా బాబా చిత్ర పటముతో ఊరేగింపులో వందలాది మంది బాబా ప్రేమికులతో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి బాబాకి జయజయ ధ్వానాలు పలికాము. ఇదే ప్రదేశంలో 60 సంవత్సరాల క్రితం బాబా షష్ఠిపూర్తి చేసుకొన్నారు. ఈరోజు బాబాది 2వ షష్ఠిపూర్తి సందర్భంగా విశేష కార్యక్రమాలు జరిగాయి.

– డా॥ వై. విజయలక్ష్మి, కేంద్ర అధ్యక్షురాలు.

# నిజాంసాగర్

నిజామాబాద్ జిల్లా నిజాంసాగర్‌లో ఫిబ్రవరి 25న బాబావారి 120వ జన్మదినోత్సవముల కదు వేడుకగా జరిపినాము. ఇదేమాదిరి గత 3 సంవత్సరాలుగా బాబావారి జన్మదినోత్సవాలు ఘనంగా జరుపుతున్నామని, సెంటర్ కార్యదర్శి శ్రీ జి. నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# కరీంనగర్

అవతార్ మెహెర్‌బాబా కరీంనగర్ సెంటర్‌లో అవతార్ మెహెర్‌బాబా 120వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిపినట్లు శ్రీ ఎన్. కిషన్ రావు, సెక్రటరీ ఒక ప్రకటనలో తెలిపారు.

# చల్లపల్లి

01.02.2014 నుండి 25.02.2014 వరకు అవతార్ మెహెర్‌బాబా 120వ జన్మదినోత్సవాలు అత్యంత వైభవంగా జరిగినవి. తదనంతరం చల్లపల్లి పుర వీధులలో ఊరేగింపు ఉత్సవములు జరిపితిమి. ఈ కార్యక్రమములలో ఉప్పిలూరి బాపిరాజు, డాక్టర్ ,బి.హెచ్. కేశవరావు విజయవాడ, మద్దాలి దుర్గాప్రసాద్, సులోచన, ఎస్. సుమిత్ర, కోసూరు మురళీ కృష్ణారావు, సి.హెచ్.ఎన్.వి. సీతారామయ్య, దాసరి మెహెర్ హేమంత్, బి.హెచ్. బాల సీతాదేవి ప్రసంగించారని కార్యదర్శి శ్రీ పి.వి.రమణారావు తెలిపారు.

# కొవ్వూరు

మెహెరస్థాన్, కొవ్వూరు 51వ వార్షికోత్సవ సందర్భమున, కొవ్వూరు, మెహెర్‌స్థాన్‌లో 28.02.2014న ప్రత్యేక సహవాస్ నిర్వహించడమైంది. బాబా ప్రేమికులచే సంకీర్తనలు, సత్య ప్రేమ సందేశములతో కార్యక్రమము జరిగాయి.

# మండపేట

అవతార్ మెహెర్‌బాబా రెండవ ఆంధ్రా పర్యటనలో ది. 02.03.1954వ తేదీన మండపేట గ్రామములో తన దివ్య దర్శన భాగ్యము కలిగించి 60 సం.లు పూర్తయిన సందర్భంగా ప్రేమిక సహవాస్ 03.03.2014న సోమవారం, మెహెర్ మండపేట సెంటర్, తరవాణీపేట వద్ద ఘనంగా జరిపినట్లు శ్రీ యం. పనసన్న, ప్రెసిడెంట్, ఒక ప్రకటనలో తెలిపారు.

# కాకినాడ

అవతార్ మెహెర్‌బాబా కాకినాడ కేంద్రములో (రామారావుపేట) మెహెర్‌బాబా 120వ జన్మదిన వేడుకలు 24.02.2014, 25.02.2014న ఘనంగా జరుపుతున్నట్లు శ్రీ మెహెర్ ప్రసాదరాజు, సెక్రటరీ ఒక ప్రకటనలో తెలిపారు.

# కన్‌కల్ సెంటర్ 33వ వార్షికోత్సవము

అవతార్ మెహెర్‌బాబా కన్‌కల్ సెంటర్ 33వ వార్షికోత్సవము ఆదివారము 09.03.2014 రోజున నిర్వహించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ బి. రామకృష్ణయ్య గారు, శ్రీ ఎ. జనార్ధన్‌రావు ముఖ్య వక్తలుగా కార్యక్రమములో పాల్గొని అవతారుని సందేశాలు వినిపించారు.




# విజయనగరం

విజయనగరంలో అవతారుని జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు శ్రీ డి. వెంకట్రావ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 25న బాబా జన్మదినోత్సవంనాడు స్థానిక ఆసుపత్రిలో రోగులు పండ్లు పంచిపెట్టామని, బాబా నామం స్మరిస్తూ శ్రీ కె.యస్. ప్రకాశరావు గారితో కలిసి నూతన గృహ ప్రవేశం చేసినట్లు శ్రీ రావ్ తెలిపారు. అలాగే, ఆనాడు పెద్ద ఎత్తున నగర సంకీర్తన నిర్వహించారు. బాబా సందేశాలపై శ్రీ అఘోరపతి, శ్రీ చింతామణి, కె.వి.రమణమూర్తి, శ్రీ కొల్లి రామారావు ప్రసంగించారు.

# విశాఖపట్నం

ఫిబ్రవరి 4 నుండి ఫిబ్రవరి 25 దాకా బాబా జన్మదినోత్సవాలు వేడుకగా జరిపినట్లు కార్యదర్శి శ్రీ యన్.వి.యస్. రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 21న విశాఖ బీచ్ తీరంలో అవతారుని ప్రేమ సందేశాలు వినిపించే చక్కని కార్యక్రమం ఏర్పాటు చేసారు. బాబా జన్మదినోత్సవం నాడు ఫిబ్రవరి 25న స్థానిక పాఠశాల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు పంచిపెట్టామన్నారు. స్థానిక బాబా ప్రేమికులు శ్రీ వెంకటరావు గారు, కె.వి. రత్నం బాబా సందేశాలపై ప్రసంగించారు.

# వధువు కావలెను

వైశ్య కులమునకు చెందిన వధువు కావలెను. వధువు బాబా ప్రేమికురాలై ఉంటే చాలా సంతోషం. పేరు: రావికంటి ప్రసన్న కుమార్, తండ్రి: పద్మాకర్, జన్మనామం: ఈశ్వర్, జన్మదినము: 17.12.1984, గోత్రము: 1. నాభిల్ల, 2. పడిగెశిల, ఎత్తు: 5.7”, రంగు: ఫెయిర్, వృత్తి: మెడికల్ షాపు, సొంతం. చదువు: డిగ్రి, మంచిరియాల్, అదిలాబాద్. ఫోన్ 92484 04333.

# వివాహము

శ్రీ గొన్నా బత్తుల వేణుగోపాల్, శ్రీమతి లక్ష్మీగార్ల కుమార్తె చి॥ల॥సౌ॥ మెహెర్ జ్యోతి వివాహము చి॥ కిరణ్ కుమార్‌తో ది: 19.03.2014 రాత్రి గం. 1.45 ని.లకు (తెల్లవారితే గురువారం) రైల్వే కమ్యూనిటీ హాల్, సత్యనారాయణపురం, రైల్వే క్వార్టర్స్, విజయవాడలో జరుపుతున్నట్లు ఆహ్వానం పంపినారు.

# శ్రీ కాసుగంటి బాబాలో ఐక్యం



అవతార్ మెహెర్‌బాబా సెంటర్ మెహెర్‌నగర్ చైర్మన్ శ్రీ కాసుగంటి శ్రీరంగారావు గారు 26.02.2014 నాడు ఉదయం బాబాలో లీనమైయ్యారు. వీరు డా॥ చంద్రమాల గారి తండ్రి. శ్రీరంగరావు గారు ఎన్నో అవతార్ మెహెర్‌బాబా సెంటర్లకు విరాళాలు ఇచ్చారు. ఈ సంవత్సరం బాబా జన్మదినం 25.02.2014 నాడు మేము మా సెంటర్‌కు వీరి పిల్లలు - డా॥ చంద్రమాల, కె. లక్ష్మణ్ కుమార్‌లను ముఖ్య అతిధులుగా ఆహ్వానించినట్లు శ్రీ కిషన్ రావు తెలిపారు

## శ్రీమతి మెట్ల శ్యామల

చల్లపల్లి బాబా సెంటరులో ప్రముఖ గాయని 1966 నుండి ఆమె గానామృతంతో మమ్ములను అలరించిన శ్రీమతి మెట్ల శ్యామల 07.02.2014 నాడు బాబాలో ఐక్యమైనారు.

## శ్రీ నాగసముద్రం

చల్లపల్లి సెంటర్‌కు అత్యంత సేవలందించిన మరొక విశిష్ట వ్యక్తి శ్రీ నాగ సముద్రం నాగభూషణం గారు 1965లో అవతార్ మెహెర్‌బాబాను గురుప్రసాద్‌లో దర్శించి బాబా స్పర్శ, ఆలింగన భాగ్యం కలిగించుకున్నవారు బాబా చెప్పినట్లు నడుచుకుంటూ వారిదైన సొంత ఇంటిలో బాబా సెంటరు నిర్వహించి 1980లో పూర్తిగా ఆ ప్రదేశమును బాబా సెంటరుకు ఇచ్చిన మహోన్నతుడు. మా సెంటరు తొలి కార్యదర్శిగా సెంటరును నడిపించి ప్రతి సంవత్సరం 2013 జనవరి 31 అమరతిధి వరకు కుటుంబ సభ్యులతో బాబా సమాధిని దర్శించిన ధన్యజీవి 12.02.2014న బాబాలో ఐక్యమైనారు.



## శ్రీమతి సూర్యవతి

టి.డి.యస్. మూర్తిగారి భార్య సూర్యవతి (68) 2014 ఫిబ్రవరి 8న బాబాలో ఐక్యమయ్యారు. ఆమె స్వల్ప అస్వస్థతతో తుదిశ్వాసవిడిచారని శ్రీ యన్.వి.యస్. రామారావు, సెక్రటరీ, విశాఖ ఒక ప్రకటనలో తెలిపారు.

## 2014 ఏప్రిల్ సంచికలో

**బాబా శిష్యుడు, కార్యదర్శిగా అవతారునికి ఎనలేని సేవలందించిన ఆది. కె. ఇరానీ గురించి ప్రత్యేక వ్యాసం చదవండి.!!**

# క్రొత్త పుస్తకం




బాబా ప్రేమికలోకానికి అందిస్తున్న 135 పేజీలు గల క్రొత్త తెలుగు పుస్తకం సార్థకజన్ములు.

మెహెరాబాద్‌లో వుంటున్న బాబా ప్రేమికులు శ్రీ అన్నాఖండాలే ఇంగ్లీషులో ప్రచురించిన **టియర్స్ ఆఫ్ ది జాయ్** పుస్తకాన్ని శ్రీ మల్లాది కృష్ణానంద్ తెలుగులో అనువదించి, ఆ చిరుపొత్తానికి సార్థకజన్ములు అని పేరు పెట్టారు. మెహెర్‌బాబాకు ఎంతో విధేయతతో సంపూర్ణంగా అంకితమై జీవించిన ముగ్గురు పెద్దలు వరుసగా 1. గుస్తాద్‌జీ, 2. ప్లీడర్ 3. కృష్ణనాయర్‌ల జీవనరేఖాచిత్రాలు ఈ చిన్ని గ్రంథంలో ఎంతో వివరంగా గ్రంథస్తం చేయడమైంది. సాక్షాత్తూ యుగావతారుని నీడలో నడుచుకున్న ఆ ముగ్గురూ ధన్యులు, సార్థకజన్ములు అని రచయిత అభిప్రాయపడ్డారు. ఈ ముగ్వురి జీవన చిత్రాలూ చిత్రంగా భిన్నమైనవి. గుస్తాద్‌జీ సాయినాథుని సన్నిధిలో, ఉపాసనీ మహారాజ్, బాబాజాన్‌లకు తన సేవలను అందించాడు. ప్లీడర్ చిన్ననాటి నుండీ గొప్ప భగవదన్వేషకుడు. కేవలం 30 సంవత్సరాల వయస్సులో తనకు మోక్షం కావాలి, బ్రహ్మైక్యం సిద్ధించాలనే లక్ష్యంతో పంచ సద్గురువులలో నలుగురు సద్గురువులను దర్శించుకుని చివరాఖరకి 1928 జనవరిలో మెహెర్‌బాబాను దర్శించుకున్నాడు. దాదాపుగా ఆనాటి నుండీ మెహెర్ బాబా ఆదేశాలు పాటించాడు. మెహెర్ బాబా ప్రవచనాలను తు.చ. తప్పక అమలు చేశాడు. 62 సంవత్సరాల వయస్సులో 1960 ఫిబ్రవరి 26న మెహెర్‌బాబా సమక్షంలోనే దివ్యకాంతి పుంజం దర్శించుకున్నాడు. అలాగే, అవతారునితో కృష్ణనాయర్ అనుభవాలు – అనుభూతులు వినేవారికి ఆశ్చర్యంతో మేను పులకరిస్తుంది. మెహెర్‌బాబా స్వయంగా ఎంపిక చేసుకున్న ధన్యుడు, శ్రీ కృష్ణనాయర్. ఈ ముగ్గురూ అవతారుని తొలితరానికి చెందిన అత్యంత సన్నిహిత ప్రేమికులు. అవతారుని ఆదేశాలు వారు అమలు చేసిన వైనం, నేటి తరం బాబా ప్రేమికులు తప్పక తెలుసుకోవాలి. ఇదొక అరుదైన సమాచారం. తెలుగువారందరూ తప్పక చదివి బధ్రపరుచుకోవల్సిన గ్రంథం. **వెల రూ. 50/- ప్రాప్తిస్థానం- ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్, యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్ కాలనీ, సికింద్రాబాద్-500087.ఫోన్:99595-53218,** **malladisukku@gmail.com**

# మెహెర్‌బాబా పత్రిక



ప్రతి నెలా 25లోగా మెహెర్‌బాబా పత్రిక పోస్టులో మీకు అందేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. ఐతే ఏ కారణంగానో నెల చివరిదాకా కూడా పత్రిక పోస్టులో మీకు రాకుంటే హైదరాబాద్ బాబా ప్రేమికులు శ్రీ వి. ఆర్. కె. శాస్త్రి, (98492-42284), లేదా శ్రీ కాగిత రామ్ (99481 28207) లను సంప్రదించగలరు.

**మీ ఇ-మెయిల్ అడ్రస్ పంపితే పత్రికను ఇంటర్‌నెట్‌లో పంపగలం. మెహెర్‌బాబా జన్మదినోత్సవాలు ప్రారంభమౌతున్న దృష్ట్యా మెహెర్‌నామం అధిక పాఠకులకు అందజేసేందుకు వీలుగా మీ బంధుమిత్రులలో కనీసం ఒకరిద్దరినైనా ప్రోత్సహించి పత్రికకు వార్షిక, జీవిత సభ్యత్వం చెల్లింపజేయండి. పత్రిక పది వేల సైన్యంతో సమానమని గమనించగలరు.**

# మెహెరాబాద్ అభివృద్ధికై

మెహెరాబాద్ అభివృద్ధికై బాబా ట్రస్టుకు విరాళాలు అందజేయవల్సిందిగా ట్రస్టు చైర్మన్ ఒక ప్రకటనలో కోరారు. డొనేషన్లు ఆన్‌లైన్ బ్యాంకు అక్కౌంటు -Bank of Maharashtra, M.G. Road Br. Ahmednagar (M.S) SB Account No. 20098450037, IFSC code MAHB0000024 ద్వారా ఆన్‌లైన్‌లో పంపవల్సిందిగా కోరుతున్నారు.

# ఘోర ప్రమాదం

గుంటూరు సెంటర్ బాబా ప్రేమికులు శ్రీ బి.డి.నరసింహారావు, ఆయన భార్య శ్రీమతి సామ్రాజ్యం, శ్రీమతి జ్యోతి (ముప్పాళ్ళ రాధాకృష్ణమూర్తి గారి కుమార్తె) మార్చి 9, 2014 బాబా సెంటర్ కార్యక్రమాలకు హాజరయి తిరిగి వారి ఇళ్ళకు వెళ్తుండగా, వెనుక నుండి వచ్చిన ఒక లారీ వీరు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొని ఘోర ప్రమాదానికి గురయ్యింది. ఈ ప్రమాదంలో శ్రీమతి సామ్రాజ్యం వెనువెంటనే బాబాలో ఐక్యమయ్యారు. మిగిలినవారు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ కోలుకుంటున్నారని శ్రీ కనకయ్య తెలిపారు.

# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్‌వర్ధిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా!
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశనము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.

మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,

త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోత్తముడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు, నీవు
పరబ్రహ్మావు,పరమాత్మవు
అల్లాహ్,
ఇలాహీ,
యజ్‌దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము.

మరియు చిట్టచివరి వరకు బాబా కొంగును దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

# జీవిత సభ్యతం

**2014** ఫిబ్రవరి – మార్చి నెలలో పంపిన వారి వివరాలు

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | మార్చి | యం.జి. రమేష్‌బాబు, హిందూపూర్ అనంతపూర్ | రూ. 1000.00 |
| 2. | మార్చి | కె. శ్రీలత, హైదరాబాద్ | రూ. 1000.00 |
| 3. | మార్చి | జి. సుజన, రామచంద్రాపురం, మెదక్ | రూ. 1000.00 |
| 4. | మార్చి | యస్.వి. త్రిపురసుందరి, కాకినాడ | రూ. 500.00 |
| 5. | మార్చి | సందీప్ మెహెర్, యు.యస్.ఎ | రూ. 6000.00 |
| | | **మొత్తం** | **రూ. 9,500.00** |

# పత్రిక సభ్యత్వం

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/- (వెయ్యి రూపాయలు).

2. రెండు దఫాలుగా కూడా రూ.500/- చొప్పున చెల్లించవచ్చు.

3. జీవిత సభ్యత్వం చెల్లింపులపై వచ్చే వడ్డీని మాత్రమే పత్రిక నిర్వహణా ఖర్చులకు వినియోగించాలని నిర్ణయించినప్పటికీ నేటి వరకు జీవిత సభ్యత్వంపై వచ్చిన వడ్డీని కూడా అసలు మొత్తానికే జమచేయడమైనది. 4. వార్షిక సభ్యత్వం రూ.100/- పోస్టల్ మనీ ఆర్డర్ ద్వారా పంపవలిసింది. 5. బ్యాంకు డ్రాఫ్టు లేదా బ్యాంకు చెక్కు ద్వారా పంపగోరు వారు శ్రీమతి నిర్మలాదేవి, హైదరాబాద్ పేరున పంపగలరు.

## మా అడ్రస్:

**ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్, యాప్రాల్, ప్లాట్ నెం.32,**
**జె.జె. నగర్ కాలనీ, సికింద్రాబాద్-500087.**
**ఫోన్:99595-53218, email: malladisukku@gmail.com**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310, Postal Concession: R&D/RNP/HSE/789/2012-2014, **Dt.19-12-2011**